/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
బుధవారం
18-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 259
పేజీలు : 8

KARIMNAGAR | HYDERABAD | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అశ్వయుజ మాసం, బుధవారం, తిథి : చవితి తె.01.26 వరకు, నక్షత్రం: అనురాధ, సా:09.00 వరకు, వర్జ్యం: తె.02.37-04.13 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.38-12.24 వరకు, రాహుకాలం: మ.12.01-01.28 వరకు



21న గగన్‌యాన్ టీవీడీ1 టెస్ట్ ఫ్లయిట్ 2



## మోసపూరిత మాటలు నమ్మొద్దు

### ఆత్మహత్యలు చూసి కన్నీళ్లు పెట్టుకున్నా.. వాళ్లను నమ్మొద్దు : కేసీఆర్



- తెలంగాణ అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నాం
- చేనేతల కోసమే బతుకమ్మ చీరలు తీసుకొచ్చాం
- మళ్లీ తెలంగాణలో బీఆర్‌ఎస్‌దే అధికారం
- ఒకప్పుడు ఆత్మహత్యలు చూసి కన్నీళ్లు పెట్టుకున్నా
- సిరిసిల్లలో చేనేతల ఆత్మహత్యలు ఉండేవి
- మానేరు ప్రాజెక్టు సిరిసిల్లను సస్యశ్యామలం చేసింది
- సిరిసిల్లలో ఎంతో అభివృద్ధి జరిగింది
- సిరిసిల్ల ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (మనం న్యూస్):** రైతుల కోసమే ధరణిని తీసుకువచ్చాం.. సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.. మోసపూరిత మాటలు నమ్మొద్దు అంటూ భారత రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో ..మిగతా 2లో



## సిద్దిపేట వజ్రపు తునక

- ఇక్కడికి రాందేది.. లేందేది..
- ఉద్యమానికి పునాది వేసింది సిద్దిపేట
- రాష్ట్రానికే తలమానికం
- ఎక్కడ ఉన్నా మిమ్మల్ని మరువ
- ఆరడుగుల బుల్లెట్టు అద్భుతం చేసిండు
- ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు

ఎట్లుండె సిద్దిపేట ఎట్లయ్యింది... ఇయ్యాళ్ల సిద్దిపేటకు రానిదేది...? ఇక్కడ లేనిదేది...? ఒక్క గాలిమోటారు తప్ప అన్నీ వచ్చాయి. రాబోయే రోజుల్లో సిద్దిపేట వజ్రపు తునక కాబోతుంది. హరీష్‌రావు స్థానంలో నేనున్నా ఇంత చేసేవాన్ని కాదేమో...! అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పురిటిగడ్డపై అడుగుపెట్టి జనసంద్రాన్ని చూసి పులకించిపోయి మాట్లాడిన మాటలివి. వివరాలు.. 5లో



## మరిన్ని పరిశోధనలు చేపట్టాలి

- ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధాని పిలుపు
- 2035 నాటికి అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి
- 2040 నాటికి చంద్రుడిపైకి తొలి భారతీయుడు ఉండాలి
- ఇస్రోకు మోదీ దిశానిర్దేశం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** రోదసీ రంగంలో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు కీలక లక్ష్యాలు నిర్దేశించారు ..మిగతా 2లో



## నెత్తురు బారిన ఈ నేలలో పుష్కలంగా సాగునీళ్లు

### నేడు ప్రాజెక్టులతో గోదావరి జలాలు మన బీళ్లకు మళ్లుతున్నాయి

- కన్నీళ్లు కారిన ఈ నేలలో పుష్కలంగా సాగు, తాగునీరు
- సిరిసిల్ల నియోజకవర్గంలో కలలో కూడా ఊహించని సంక్షేమం
- రాష్ట్ర వ్యాప్తంగా కూడా అభివృద్ధి జరుగుతోంది
- మన కండ్ల ముందు అభివృద్ధి కనబడుతుంది
- అప్పర్ మానేరు నేడు మత్తడి దుంకుతున్నది
- అందుకు కారణం సీఎం కేసీఆర్ ముందుచూపే
- సిరిసిల్ల జిల్లా ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్

వివరాలు.. 2లో

## తెలంగాణ వచ్చాక దుర్భిక్షం పోయి సుభిక్షం వచ్చింది

### సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నెంబర్ వన్

గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్

**మహబూబాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెంలగాణ నెంబర్‌వన్‌గా ఉందని రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగి మహబూబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్‌లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి ..మిగతా 2లో





## ప్రజలపై కాంగ్రెస్ హామీల వర్షం

- రూ.25లక్షలు ఆరోగ్య బీమా ప్రకటన
- రూ.500కే గ్యాస్ సిలిండర్
- రూ.2 లక్షల వరకు రైతుల రుణాల మాఫీ
- మహిళలకు నెలకు రూ.1500 రూపాయల ఆర్థిక భరోసా
- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో

**మధ్యప్రదేశ్, అక్టోబర్ 17 :** మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రజలపై కాంగ్రెస్ పార్టీ హామీల వర్షం కురిపించింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల వరకు రైతుల ..మిగతా 2లో



## తమిళనాడులో ఘోర ప్రమాదం

- బాణసంచా ఫ్యాక్టరీల్లో పేలుళ్లు
- 13 మంది మృతి, మరి కొంతమందికి తీవ్రగాయాలు

**విరుధునగర్, అక్టోబర్ 17 :** తమిళనాడులోని శివకాశి సమీపంలో రెండు బాణసంచా ఫ్యాక్టరీల్లో పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనల్లో 13 మంది మృతిచెందారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మతుల కుటుంబాలకు తమిళనాడు ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారు. తమిళనాడు.. విరుధునగర్ జిల్లాలో రెండు ..మిగతా 2లో

### మంచిమాట

నిన్ను బాధ పెట్టిన సందర్భాల గురించి ఎక్కువగా ఆలోచించకు ఎందుకంటే కాలం అనేది ఒకటి ఉంది అది అన్నిటికీ తప్పకుండా సమాధానం చెప్పి తీరుతుంది.

శుభోదయం

## నగదు, మద్యం ఏరులై పారుతుంది

### కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి ఛాలెంజ్



- కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి కుంటుపడింది
- టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి
- గన్‌పార్కు వద్ద తీవ్ర ఉద్రిక్తత
- పోలీసులకు, కాంగ్రెస్ నేతలకు మధ్య వాగ్వాదం

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** హైదరాబాద్ గన్‌పార్కు వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా ఉండాలని కేసీఆర్‌కు ఛాలెంజ్ విసిరిన టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అమరవీరుల ముందు ప్రమాణం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన్ను అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. రేవంత్ అరెస్టుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ..మిగతా 2లో

## కళ్యాణలక్ష్మికి దీటుగా కాంగ్రెస్ పథకం



- లక్షతో పాటు తులం బంగారం ఇచ్చేలా మార్పు
- కసరత్తు చేస్తున్న మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ శ్రీధర్ బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్):** తెలంగాణాలో వచ్చే నెల నవంబర్ 30వ తేదీన ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఎన్నికల హడావిడి మొదలైంది. ఈ ఎన్నికల పోరులో గెలుపొందాలని ఒక పార్టీకి మించి మరొకపార్టీ పోటీ పడుతున్నాయి. కర్ణాటకలో గెలుపొందిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ మళ్లీ తెలంగాణలో గెలుపొందాలని గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కర్ణాటక ఫార్ములానే తెలంగాణాలోనూ మహిళా ఓటర్లనే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను రూపొందించనుంది. గతంలో కేసీఆర్ వధువులకు ఉపయోగకరంగా 'కల్యాణ లక్ష్మీ' పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం పేరు మార్చి 'మహాలక్ష్మీ' ..మిగతా 2లో

## కనపడని.. కమల.. వికాసం..!

- సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న బీజేపీ శ్రేణుల హడావుడి ఎక్కడ
- పార్టీ పరిస్థితిని చూసి చతికిల పడుతున్న జిల్లా నాయకత్వం
- ఎందుకో కాషాయనాథులలో కనపడని జోష్
- అభ్యర్థుల ఎంపిక ఆలస్యంతో ఆశవాహుల అయోమయం
- ఇప్పటికే కొందరు నేతలు కాంగ్రెస్ బీఆర్‌ఎస్ పార్టీలతో సంప్రదింపులు




6

## మూడోసారీ బీఆర్‌ఎస్‌దే అధికారం



- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతం కంటే భిన్నంగా ఫలితాలు
- మా ఫథకాలను కాంగ్రెస్సే కాపీ కొట్టింది
- మీడియా సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

వివరాలు.. 7లో



## కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కుట్ర రాజకీయాలు 2

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : అర్వింద్

## తమిళనాడులో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరు బాణసంచా ఫ్యాక్టరీల్లో మంగళవారం జరిగిన పేలుడు ఘటనల్లో 13మంది మృతిచెందారు. శివకాశి సమీపంలోని రంగపాళయం గ్రామంలో ఉన్న ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి 12 మంది మరణించారు. మరి కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. కిచ్చనాయకన్‌పట్టి గ్రామంలోని బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన మరో పేలుడులో ఓ వ్యక్తి మృతిచెందారు. పేలుళ్లపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడ్డ వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. రంగపాళయం గ్రామంలో ఉన్న కనిష్కర్ బాణసంచా తయారీ కేంద్రంలో 80మంది పైగా కార్మికులు పనిచేస్తున్నారు. కర్మాగారానికి ఎదురుగా బాణసంచా దుకాణాన్ని యజమానులు నిర్వహిస్తున్నారు. బాణాసంచాకు నిప్పంటుకోవడం వల్ల ఒక్కసారిగా భారీ పేలుడు జరిగింది. ఈ ప్రమాదంలో 12మంది మరణించగా.. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని రక్షించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో కొందరిని భాక్యం(35), మహదేవి(50), పంచవర్ణం(35), బాలమురుగన్(30), తమిళ్‌సెల్వి(55), మునీశ్వరి(32), తంగమలై(33), అనిత(40), గురువమ్మాళ్(55)గా పోలీసులు గుర్తించారు. కిచ్చనాయకన్‌పట్టి గ్రామంలో జరిగిన మరో ఘటనలో వెంబు (35) అనే వ్యక్తి మృతి చెందగా.. ఇద్దరు మహిళలు గాయపడ్డారు. క్షతగాత్రులను కాపాడిన రెస్క్యూ బృందం.. శ్రీవిల్లిపుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనలపై స్పందించిన తమిళనాడు సీఎం ఎంకే.స్టాలిన్.. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. క్షతగాత్రులకు ప్రత్యేక చికిత్స అందించాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పెయింట్స్ కంపెనీలో అగ్నిప్రమాదం.. గుజరాత్.. వల్సాడ్ జిల్లాలోని గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్-జీఐడీసీ ఫేజ్ 3లోని పెయింట్స్ కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. దట్టమైన పొగతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## 21న గగన్‌యాన్ టీవీడీ1 టెస్ట్ ఫ్లయిట్

బెంగళూర్, అక్టోబర్ 17 : గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా టీవీడీ1 టెస్ట్ ఫ్లయిట్‌ను ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజున ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్య సమయంలో పరీక్ష చేపట్టే అవకాశాలు ఉన్నట్లు ఇస్రో తన ట్వీట్‌లో తెలిపింది. టెస్ట్ మాడ్యూల్‌కు చెందిన కొత్త ఫోటోలను ఇస్రో తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి టీవీడీ1 టెస్ట్ ఫ్లయిట్ ఉంటుంది. అంతరిక్షంలోకి వ్యోమగాముల్ని పంపేందుకు ఇస్రో ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. అయితే ఆ ప్రాజెక్టులో కీలకమైన క్రూ మాడ్యూల్ పరీక్షకు ఇస్రో సిద్ధమైంది. నింగిలోకి వెళ్లి వచ్చే వ్యోమగాములకు చెందిన క్రూ మాడ్యూల్ టీవీడీ1ను లాంచింగ్ కోసం ఇటీవల కాంప్లెక్స్‌కు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. పీడనం లేనటువంటి క్రూ మాడ్యూల్‌లోనే వ్యోమగాములు నింగిలోకి వెళ్తారు. ఈ పరీక్ష సమయంలో ఆ మాడ్యూల్ బంగాళాఖాతంలో ల్యాండ్ అవుతుంది. సముద్రం నుంచి ఇండియన్ నేవీ ఆ మాడ్యూల్ మెషన్‌ను భూమ్మీదకు తీసుకువస్తుంది. టీవీడీ1మాడ్యూల్ నిర్మాణం తుది దశలో ఉందని, ఈ మాడ్యూల్ 17 కిలోమీటర్ల ఎత్తుకు వెళ్లిన తర్వాత.. అబార్ట్ సీక్వెన్స్‌లో భాగంగా మళ్లీ భూమి మీదకు వస్తుందని ఇస్రో ఇటీవల తెలిపింది. పారాచూట్ల సాయంతో టీవీడీ1దిగుతుంది. శ్రీహరికోట నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర ప్రాంతంలో ఆ మాడ్యూల్ ల్యాండవుతుంది.

## మరిన్ని పరిశోధనలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ. 2040 నాటికి చంద్రుడిపైకి తొలి భారతీయుడిని పంపే విధంగా ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. 2035 నాటికి భారత స్పేస్ సెంటర్‌ను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గగన్‌యాన్ మిషన్ ఏర్పాట్లపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించారు. త్వరలోనే మానవరహిత ఫ్లైట్ టెస్టులు నిర్వహించేందుకు ఇస్రో సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ప్రధాని.. ఆ వివరాలను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. అంతరిక్షంలోకి మనుషులను పంపేందుకు భారత్ చేపట్టనున్న ఈ తొలి మిషన్.. 2025లో జరిగే అవకాశం ఉందని పీఎంఓ పేర్కొంది. అక్టోబర్ 21న గగన్‌యాన్ తొలి ఫ్లైట్ టెస్టును ఇస్రో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా.. మరిన్ని కొత్త పరిశోధనలు చేపట్టాలని ఇస్రో శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు ప్రధాని మోదీ. భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. 2040 నాటికి చంద్రుడిపై తొలి భారతీయుడిని పంపించాలని ఇస్రో శాస్త్రవేత్తలకు మోదీ సూచించారు. 2035 నాటికి అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అంగారక గ్రహంపైకి ల్యాండర్‌ను పంపించాలని మోదీ పేర్కొన్నారు. శుక్రగ్రహం వద్దకు ఆర్బిటార్‌ను పంపించే మిషన్‌పై పని చేయాలని సూచించారు. గగన్‌యాన్ మిషన్ పురోగతిపై చేపట్టిన ఉన్నత స్థాయి సమీక్షలో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గగన్‌యాన్ మిషన్‌పై సమగ్ర వివరాలను మోదీకి సోమనాథ్ తెలియజేశారు. ఇప్పటివరకు అభివృద్ధి చేసిన సాంకేతికతల గురించి వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారు 20 భారీ ప్రయోగాలను ఇస్రో చేపట్టనుంది. మూడు మానవరహిత మిషన్లను ప్రయోగించనుంది.

# మోసపూరిత మాటలు నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా సిరిసిల్లలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడిన సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ టార్గెట్‌గా నిప్పులు చెరిగారు. తెలంగాణ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. చేనేతల కోసమే బతుకమ్మ చీరలు తీసుకొచ్చామని.. కొందరు రాజకీయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఓట్ల అబద్దాలు చెప్పలేదని.. ఇచ్చిన హామీలను అమలు చేసి చూపుతున్నామని కేసీఆర్ పేర్కొన్నరు. మళ్లీ తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీయే అధికారం చేపడుతుందని కేసీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో ఒకప్పుడు ఆత్మహత్యలు చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 70ఏళ్ల రాజకీయ చరిత్రలో సిరిసిల్లలో ఎన్నో సార్లు పర్యటించానని, సమైక్య పాలనలో నాశనం అయిపోయిందంటూ కేసీఆర్ పేర్కొన్నారు. అప్పర్ మానేరు ప్రాజెక్టుతో జలధార పరుగులు పెడుతున్నదంటూ పేర్కొన్నారు. నిండు కుండలా మారి మానేరు ప్రాజెక్టు సిరిసిల్లను సస్యశ్యామలం చేసిందన్నారు. సిరిసిల్లలో ఎంతో అభివృద్ధి జరిగిందంటూ పేర్కొన్నిరు. సిరిసిల్లలో ఒకప్పుడు చేనేతల ఆత్మహత్యలు ఉండేవని.. చేనేతల అభివృద్ధి కోసం కేటీఆర్ ఎంతో చేశారంటూ అభినందించారు. 24 గంటల కరెంట్ విషయంపై మరోసారి కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ అంటూ చెప్పిందని.. మోసపూరిత హామీలను నమ్మొద్దంటూ కేసీఆర్ పేర్కొన్నారు. ఓట్ల కోసం మోసపూరిత హామీలతో వస్తారని.. కాంగ్రెస్ ను నమ్మవద్దంటూ సూచించారు. మరికొందరు మతాల మధ్య గొడవలు పెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తారని జాగ్రత్తగా ఉండాలంటూ సూచించారు. మరోసారి గులాబీ పార్టీని ఆశీర్వదించాలంటూ కేసీఆర్ కోరారు. జన్మభూమిని మించిన స్వర్గం లేదని.. సిద్దిపేట గడ్డ తనను నాయకుడ్ని చేసిందని సీఎం కేసీఆర్ అన్నారు. మంగళవారం ఆయన సిద్ధిపేటలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతూ.. సిద్ధిపేట తనను తెలంగాణకు ముఖ్యమంత్రికి చేసిందని, సిద్ధిపేట రుణం జన్మలో ఏమిచ్చినా తీర్చుకోలేనన్నారు. ''సిద్ధిపేటతో ఎంతో అనుబంధం నాకు ఉంది. సిద్ధిపేటలో నేను తిరగని పల్లె, ప్రాంతం లేదు. 'చింతమడకలో నేను చిన్నవాణ్ణిగా ఉన్నప్పుడు మా అమ్మకు ఆరోగ్యం దెబ్బతింటే ఓ ముదిరాజ్ తల్లి నాకు పాలు పట్టింది' అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సీఎం కేసీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. ''సిద్ధిపేట మంచినీళ్ల పథకం రాష్ట్రానికే ఆదర్శం. సిద్ధిపేటను హరీష్‌రావు ఎన్నో రెట్లు అభివృద్ధి చేశారు. సిద్ధిపేట అన్ని రకాలుగా అభివృద్ధి చెందింది. తెలంగాణలోనే సిద్ధిపేట వజ్రం తునుకలా తయారవుతోంది. ఆరు అడుగుల బుల్లెట్ హరీష్‌రావు సిద్ధిపేటకు అప్పగించా' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ రోజు సీఎం కేసీఆర్ ఆశీస్సులు, మీ దివెనలతో సిద్దిపేటకి సేవ చేసే అవకాశం దక్కిందని మంత్రి హరీష్‌రావు అన్నారు. మరొక్కసారి సీఎం కేసీఆర్ ఆశీర్వదించి నాకు అవకాశం ఇచ్చారు. నాకు శ్వాస ఉన్నంత కాలం, జన్మ ఉన్నంత వరకు సీఎం కేసీఆర్‌కి, సిద్దిపేట జనాలకే నా జీవితం అంకితం చేస్తాను. మీరు చూపించిన ప్రేమాభిమానాలకు నా చర్మం ఒలిచి మీకు చెప్పులు కట్టించిన తక్కువే. నా చివరి శ్వాస ఉన్నంతవరకు సీఎం కేసీఆర్ నాయకత్వంలో మీకు సేవ చేస్తాను' అంటూ హరీష్‌రావు భావోద్వేగానికి లోనయ్యారు. ఇది ఎన్నికల ప్రచార సభలా లేదని, మన కలను నిజం చేసిన సీఎం కేసీఆర్‌కి కతజ్ఞత సభలా అనిపిస్తుందని మంత్రి హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట దశాబ్దాల కలను నిజం చేసిన నాయకుడు కేసీఆర్. ఆనాటి సీఎం ఎన్టీఆర్‌కు సిద్దిపేట జిల్లా కావాలని కేసీఆర్ వినతి పత్రం ఇచ్చారు. ఇప్పుడు ఆయనే సిద్దిపేటను జిల్లా చేశారు. సిద్దిపేటకి రైలు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. సిద్దిపేటకి కాళేశ్వరం నీళ్లు వస్తాయంటే ప్రతి పక్షాలు ఎగతాళి చేశాయి. మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి చేసి సిద్దిపేటకి నీళ్లు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్ దే. తెలంగాణకి సీఎంగా ఉన్న ఆయన వ్యవసాయం చేస్తున్నారు. ఆయన ఓ రైతు బిడ్డ కాబట్టే.. రైతుల బాధలు ఆయనకు తెలుసు' అని హరీష్‌రావు పేర్కొన్నారు. 'సిద్దిపేటకు భారీగా తరలివచ్చిన ఆత్మీయులైన సిద్దిపేట అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెల్లకు హదయపూర్వక నమస్కారాలు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ. ఈ మాట అన్నది సాక్షాత్తు శ్రీరామ చంద్రుడు. జన్మభూమిని మించిన స్వర్గం లేదు. సిద్దిపేట పేరు విన్నా.. సిద్దిపేట భూమికి వచ్చినా.. సిద్దిపేట నా మనసులో కలిగే భావన ఇది. ఈ సిద్దిపేట గడ్డ నన్ను సాదింది. చదువు చెప్పింది. నాకు రాజకీయ జన్మనిచ్చింది. నన్ను నాయకున్ని చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యేంత ఎత్తుకు పెంచిన గడ్డ నా గడ్డ అని గర్వంగా మనవి చేసుకుంటున్నా. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా యావత్ దేశమే ఆశ్చర్యపడేలా.. అనేక రంగాల్లో ముందుకు తీసుకుపోతున్నా అంటే ఈ గడ్డ నుంచి నాకు దొరికిన రక్తం, మాంసం, బుద్ధి, బలం ఈ గడ్డ పుణ్యమే. నన్ను ఇంతవాన్ని చేసిన మాతభూమి, కన్నతల్లికి మీ అందరి సాక్షిగా శిరస్సు వహించి నమస్కారం చేస్తున్నా' అన్నారు. 'నన్ను ప్రతిసారి విజేతగా నిలబెట్టిన ఈ గడ్డ రుణం ఈ జన్మలో ఏమిచ్చినా తీర్చుకోలేనని మనవి చేస్తున్నా. ఈ సభలో నాతో కలిసి పని చేసిన మిత్రులు, సహచరులు వందలాది మంది ఉన్నారు. అనేక జ్ఞాపకాలు, ఎంతో మంది ఆత్మీయులు ఉన్నారు. కొండంరాజ్‌పల్లి మాదన్న ఎక్కడ ఉన్నడో.. మా నవాబ్ సాబ్ ఎక్కడ ఉన్నాడో. నాకు డిపాజిట్ కట్టే తోర్నాల చంద్రారెడ్డి బావ ఎక్కడ ఉన్నడో. ఇలా అనేక మంది అనేక మంది ప్రతి గ్రామంలో వంద, మూడు వందల పేర్లు పెట్టి పిలిచేంత అభిమానం కలిగిన గడ్డ సిద్దిపేట గడ్డ. ఆ నాడు అంత అద్భుతమైన పద్ధతిలో ఈ గడ్డను ముందుకు తీసుకెళ్లేందుకు చాలా తిప్పలు పడ్డాం. ఒక సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటే.. దామోదర్‌రావు, ఎంపీకి రంగనాయక్ సాగర్ నుంచి హెలికాప్టర్ నుంచి చూపించాను. సిద్దిపేటలో మంచినీళ్ల కరువు వస్తే వార్డుకో ట్యాంకు పెట్టి.. మిత్రులను వెంటేసుకొని బయలుదేరాం. సాయంత్రం వరకు ప్రయత్నం చేసి వంద బోర్లు వేస్తే నీళ్లు రాలే. ఒక్కొక్కటి జ్ఞాపకం చేసుకుంటే బాధేస్తుంది. మంచినీళ్ల కోసం సిద్దిపేట పడ్డ తిప్పలు. లోయర్ మానేరు నుంచి నీళ్లు తెచ్చుకొని జలజాతర చేసుకున్నాం. ఈ రోజు మిషన్ భగరీథ తెలంగాణ మొత్తం అమలవుతుందంటే.. సిద్దిపేట మంచినీళ్ల పథకమే దానికి పునాది. ఇక్కడి అనుభవమే అక్కడిదాకా.. బ్రహ్మాండంగా పని చేసిందని అన్నారు. రైతు సోదరులను హెచ్చరిస్తున్నా. మూడు సంవత్సరాలు రాత్రింబవళ్లు కష్టపడి ధరణి పోర్టల్ తీసుకొచ్చాం. రైతుల భూములు క్షేమంగా ఉండాలి. కౌలుకు ఇచ్చినంత మాత్రాన ఇంకోకరి పరం కావొద్దు అని ధరణిని తీసుకొచ్చాం. రిజిస్ట్రేషన్లు పావుగంటలో అయిపోతున్నాయి. ధరణి వల్ల 98శాతం మంది రైతులకు మేలు జరిగింది. కాంగ్రెస్ పార్టీ భుజం మీద గొడ్డలి పెట్టుకుని రెడీగా ఉంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ధరణిని తీసి బంగాళాఖాతంలో విసిరేస్తారట. మళ్లీ వీఆర్‌వోలు, గిర్దావర్‌లు వాని భూమి వీనికి రాసి, వాని భూమి ఇంకోకరికి రాసి, మళ్లీ రైతులను కోర్టుల చుట్టు తిప్పే పరిస్థితి వస్తుంది. మీ మీద వీఆర్వో, గిర్దారవ్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ సెక్రటరీ, సీసీఎల్ఏ, రెవెన్యూ మంత్రి ఉండేవారు. వీరిలో ఒకరికి కోపమొచ్చినా రైతు భూమి ఆగమయ్యేది. కానీ ఇవాళ ఆ అధికారం తీసేసి రైతులకే అధికారం ఇచ్చాం. మీ బొటన వేలి ప్రమేయం లేకుండా.. భూమి ఇతరులకు పోయే అవకాశం లేదు. మీ భూమి హక్కులు మీ బొటనవేలితోనే మారుతాయి. ఈ సిగ్గుమాలిన కాంగ్రెస్ మాటలు నమ్మకండి.. ఇవాళ ధరణి పుణ్యం వల్ల పల్లెలు ప్రశాంతంగా ఉన్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ప్రమాదం వచ్చి నెత్తిన పడుతది. మళ్లీ కథ మొదటికి వస్తది.. చాలా అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను. అనేక రంగాల్లో.. మనం నంబర్‌వన్‌గా ఉన్నాం అని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణ వచ్చాక దుర్భిక్షం పోయి సుభిక్షం వచ్చింది

(మొదటిపేజీ తరువాయి)

పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలో నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక దుర్భిక్షం పోయి సుభిక్షం అయిందని, సంక్షోభం పోయి సంక్షేమం అయిందన్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్ర సంపదను పెంచి ఆ సంపదను ప్రజలకు పంచడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ప్రజల ఆదాయం పెరిగిందని, ఉపాది అవకాశాలు పెరిగి మౌళిక సౌకర్యాలు మెరుగుపడ్డాయన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. 2014, 2018 ఎన్నికల్లో పట్టిన గతే బిజెపికి కాంగ్రెస్‌కు పడుతుందాని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమాలుకానీ హామీలను ఇస్తున్నారన్నారు. ప్రజలు ఆలోచించాలని కాంగ్రెస్ బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే ఇక్కడ ప్రజలు కొంతైనా నమ్మేవారన్నారు. ఎన్నికలు రాగానే కొత్తబిచ్చగాళ్ల మాదిరిగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలమీద పడుతున్నరని, నోరు తెరిస్తే చాలు అన్నీ అబద్ధాలే మాట్లాడుతున్నారు. మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నవాళ్ళను. నమ్మితే మోసపోవడం ఖాయం అని అన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్, ఇప్పుడు డబ్బులకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్లు అమ్ముకుంటున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు అధికారంలోకి రావడం కలగానే మిగులుతుందన్నారు. గత సంక్షేమ పథకాలకు తోడు కొత్త పథకాలను, మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారనిరైతుబీమా తరహాలోనే పేదల కోసం 'కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి దీమా'ను అమలు చేస్తారని తెలిపారు. దేశంలో అత్యధిక మందికి, ఎక్కువ మొత్తంలో పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రం అన్నారు. రాష్ట్రంలో 46లక్షల మందికి పెన్షన్లు అందుతున్నాయని 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.200 ఉండేదని తెలంగాణ వచ్చాక 2016లకు పెంచుకున్నాం అన్నారు. కొత్త మేనిఫెస్టో ప్రకారం ఏటా రూ.500 పెంచుతూ 2028 నాటికి రూ.5016 పెంచుతామన్నారు. దివ్యాంగులకు ప్రస్తుతం ఉన్న రూ.4016ను ఎన్నికలు పూర్తవ్వగానే రూ.5016కు, తదుపరి రూ.6016కు పెంచుతామన్నారు. అర్హులైన మహిళలు అందరికీ నెలకు రూ.3000 గౌరవ భృతి అందుతుందన్నారు. రైతుబంధు రూ.16,000కు పెంపుదల, రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ, గృహలక్ష్మి ఇళ్ళ మంజూరుతో పాటుగా స్వంత స్థలం లేని పేదలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేస్తామన్నారు. అగ్రవర్ణ పేదలకు ప్రతి నియోజకవర్గంలో గురుకులం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన పౌరులందరికి రూ.15 లక్షలతో కేసీఆర్ ఆరోగ్య రక్ష. పేదలకు రూ.400కే గ్యాస్ సిలిండర్. చెప్పిన పనులను కేసీఆర్ మాత్రమే చేయగలరన్నారు. ప్రజలు కేసీఆర్‌ను మాత్రమే నమ్ముతారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని, కాంగ్రెస్, బిజెపిలకు మెజారిటీ స్థానాలలో అభ్యర్థులు లేరని డిపాజిట్లు రావని అధికారం మీకు కలగానే మిగులుతుందని చెప్పారు. కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమనిప్రతి కార్యకర్త సైనికులు లాగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్, ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీలు, జడ్పీటిసిలు మండల పార్టీ అధ్యక్షులు రైతు సమన్వయ కమీటీ కోఆర్డినేటర్లు, పిఎసిఎస్ చైర్మన్లు మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు, మండల జనరల్ సెక్రటరీలు, సింగల్ విండో డైరెక్టర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నెత్తురు బారిన ఈ నేలలో పుష్కలంగా సాగునీళ్లు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 17 (మనం న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి.. మల్లన్నసాగర్‌ను నింపి, కూడవెల్లి వాగు ద్వారా మన బీళ్లకు మళ్లుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. నెత్తరు బారిన ఈ నేలలో నీళ్లు పారుతున్నాయి. కన్నీళ్లు కారిన ఈ నేలలో సాగు తాగునీరు పుష్కలంగా వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో కలలో కూడా ఊహించని సంక్షేమం, అభివృద్ధి జరిగిందని కేటీఆర్ తెలిపారు. అంతే కాదు రాష్ట్ర వ్యాప్తంగా కూడా అభివృద్ధి జరుగుతోంది. మన కండ్ల ముందు కనబడుతుంది. అప్పర్ మానేరు మత్తడి దుంకుతున్నది అంటే దానికి కారణం కేసీఆర్. సిరిసిల్ల నేతన్నల జీవితాలు, బతుకులు మారాయి. ఇది నేతల, చేతల, చేనేతల ప్రభుత్వం. సిరిసిల్ల ఇవాళ కలలో ఊహించని విధంగా జిల్లా అయింది. 90 కిలోమీటర్ల పోయే బాధ తప్పింది. మన సిరిసిల్లలోనే కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులందరూ కొలువుదీరారు. ఇవాళ జిల్లాకు మెడికల్ కాలేజీ తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌ది. ఇంజినీరింగ్ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీతో పాటు అన్ని విద్యాసంస్థలు ఇచ్చారు. కేజీ టు పీజీ విద్యను కూడా ఇక్కడే మొదటిసారిగా ప్రారంభించారని కేటీఆర్ తెలిపారు. జిల్లాలో ఆరున్నర మీటర్లు భూగర్భ జలాలు పెరిగాయి. ఐఏఎస్ అధికారుల శిక్షణలో సిరిసిల్ల గురించి చర్చ జరుగుతుంది. సిరిసిల్లకు అడగకుండానే అన్ని ఇచ్చారు. మాఆడబిడ్డల ఆధారాభిమానంతో, అన్నదమ్ముళ్ల ఆశీర్వాదంతో తప్పకుండా మళ్లీ గులాబీ జెండా ఎగురవేస్తాం. మీ నాయకత్వానికి మళ్లీ సిరిసిల్ల జై కొడుతుంది. హ్యాట్రిక్ సీఎం కోసం సిరిసిల్ల ప్రజలు ఆశీర్వాదం ఇస్తారు. మీ ప్రేమ, ఆశీర్వాదం భవిష్యత్‌లో కూడా ఉండాలని కోరుకుంటున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కళ్యాణలక్ష్మికి దీటుగా కాంగ్రెస్ పథకం

(మొదటిపేజీ తరువాయి)

స్కీంగా కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చేర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ పథకం కింద వధువుకు 10 గ్రాములు బంగారం, అలాగే వధువు కుటుంబానికి లక్ష రూపాయల్ని అందజేసేందుకు కాంగ్రెస్ సీనియర్ నేతలతో చర్చలు జరుపుతున్నట్లు కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌బాబు మంగళవారం తెలిపారు. అయితే ఈ సిఫార్సు ఫైనల్ కాదని.. ఈ హామీ అమలుపై పిసిసి, ఎఐసిసి తీసుకున్న నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని శ్రీధర్‌బాబు అన్నారు. కాగా, ఇప్పటికే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, రూ.500లకే ఎల్పిజి సిలిండర్, మహిళలకు ఉచిత ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలనిచ్చింది.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్ర రాజకీయాలు

నిజామాబాద్, అక్టోబర్ 17 (మనం న్యూస్): బీజేపీ పార్టీని నష్ట పరిచేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత కుట్ర చేస్తున్నారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. మోడీ ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని అన్నారు. బిజెపితోనే దేశానికి, రాష్ట్రానికి రక్ష అన్నారు. మంగళవారం నాడు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఎంపి అర్వింద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్వింద్ మీడియాతో మాట్లాడుతూ..'మున్నూరు కాపులు, మైనార్టీలు ఆకుల లలితను నమ్మొద్దు. గతంలోనూ ఆకుల లలిత, డీఎస్‌ను మోసం చేసి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకుంది. ప్రస్తుతం డీఎస్ కొడుకు సంజయ్‌ను మోసం చేయాలని చూస్తోంది. ఎమ్మెల్సీ కవిత, రేవంత్‌రెడ్డి వ్యాపార భాగస్వాములు. ఆకుల లలితను కవిత కావాలని కాంగ్రెస్ పార్టీలోకి పంపి టికెట్ ఇప్పిస్తున్నారుని ఎంపీ అర్వింద్ ధ్వజమెత్తారు.

## ప్రజలపై కాంగ్రెస్ హామీల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

రుణాల మాఫీ వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఈ మేరకు ఎన్నికల మేనిఫెస్టోను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ భోపాల్‌లో విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది కాంగ్రెస్. మహిళలకు నెలకు రూ.1500 రూపాయల ఆర్థిక భరోసా కల్పిస్తామని పేర్కొంది. అలాగే రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనిఫెస్టోను మంగళవారం భోపాల్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత దిగ్విజయ్ సింగ్, పార్టీ నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత క్వింటా ధాన్యాన్ని రూ.2500కు కొనుగోలు చేస్తామని ప్రకటించింది కాంగ్రెస్. అలాగే క్వింటా గోధుమలను రూ.2600కు కొనుగోలు చేస్తామని పేర్కొంది. రాష్ట్ర పౌరులకు 25లక్షల రూపాయల ఆరోగ్య బీమా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. అలాగే రాష్ట్రంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వెల్లడించింది. అలాగే రాష్ట్రం తరపున ఐపీఎల్ జట్టు ఏర్పాటు అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చింది. రైతులు, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు సహా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా 59 వాగ్దానాలతో 106 పేజీల మేనిఫెస్టోను మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా పాత పింఛను పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. అలాగే పాఠశాల విద్యను విద్యార్థులకు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు రెండేళ్లపాటు నిరుద్యోగ భతి నెలకు రూ.1500 నుంచి రూ.3వేల వరకు అందజేస్తామని హామీ ఇచ్చారు. 230 సీట్లున్న మధ్యప్రదేశ్ శాసనసభకు నవంబరు 17న పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు డిసెంబరు 3న రానున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే కాంగ్రెస్ 144 మందితో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్‌ను ఛింద్‌వాఢా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపింది.

# నగదు, మద్యం ఏరులై పారుతుంది

(మొదటిపేజీ తరువాయి)

నేతలు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం రసవత్తరంగా మారింది. ఎన్నికల సమయంలో నగదు, మద్యం ఏరులై పారుతుందని ప్రతి ఒక్కరికి తెలుసు. ఇప్పటికే జరిగిన ఎన్నికల్లో భారీ నగదు, మద్యాన్ని పోలీసులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో ప్రలోభాలను తగ్గించేందుకు ఓవైపు ఎన్నికల అధికారులు.. మరోవైపు పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఎలక్షన్‌లో ఎటువంటి ప్రలోభాలు పెట్టకూడదని.. డబ్బు, మద్యం పంచకుండా ప్రచారం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సవాల్‌లో భాగంగా మంగళవారం అమరవీరుల స్థూపం ప్రమాణం చేసేందుకు వెళ్లారు. అప్పటికే అక్కడ భారీగా మోహరించని పోలీసులు రేవంత్ రెడ్డిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఓ వాహనంలో ఆయన్ను గాంధీ భవన్‌కు తరలించారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు కేసీఆర్ సర్కార్ తీరుపైనా విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి కుంటుపడిందని రేవంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. గ్రూప్-2 పోస్ట్‌పోన్‌తో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ప్రవళిక విషయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన డీసీపీపై కేసు పెడతామని రేవంత్ రెడ్డి తెలిపారు. మరణించిన చెందిన అమ్మాయి ఫోన్ సీజ్ చేస్తే సమాచారం బయటకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సీజ్ చేసిన ప్రవళిక ఫోన్ ఓపెన్ చేయాలంటే కోర్టు అనుమతి తీసుకోవాలని.. ఫోన్ సమాచారంపై ఫోరెన్సిక్ నివేదిక రాక ముందే డీసీపీ ప్రెస్ మీట్ ఎలా పెడతారని నిలదీశారు. డీసీపీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మరోవైపు రేవంత్ అరెస్టుతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో వారిని అక్కడి నుంచి పంపేందుకు పోలీసులు ప్రయత్నించగా.. పోలీసులు, కాంగ్రెస్ నేతలకు మధ్య తోపులాటు చోటుచేసుకుంది. అనంతరం అక్కడి నుంచి వారిని పోలీసులు వాహనాల్లో తరలించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ చేసి గెలవాలని చూస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందువల్లే తాము విసిరిన సవాల్‌ను స్వీకరించలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత అమరవీరుల స్థూపం వద్దకు రాకపోవడంతో ఎన్నికల్లో గెలిచేందుకు డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారని తమకు స్పష్టత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీవి ఎప్పుడూ దిగజారుడు రాజకీయాలేనని రేవంత్‌రెడ్డి విమర్శించారు. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఏం చేసిందో, చివరకు ఏమైందో ప్రజలు చూశారన్నారు. డబ్బు, మద్యంతో ఉప ఎన్నికలు గెలిచిన చరిత్ర బీఆర్ఎస్‌ది అంటూ దుయ్యబట్టారు. అలా ఎన్నికలు గెలవాలని తాము ఎప్పుడూ అనుకోలేదని తెలిపారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ రెడ్డి ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా రేపటి ఎన్నికల్లో సిద్ధాంతాలు ప్రచారం చేసి ఓట్లు అడుగుదామని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 6 గ్యారంటీలు ప్రచారం చేసే తాము ఓట్లు అడుగుతామని.. మేనిఫెస్టో చూపించి ఓట్లు అడిగేందుకు బీఆర్ఎస్ సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజలను మరోసారి మోసం చేయాలనేది కేసీఆర్ యోచన అని ఆరోపించారు. డబ్బు, మద్యం పంపిణీ చేసి ఎన్నికల్లో గెలవాలని కేసీఆర్ చూస్తున్నారన్న రేవంత్.. బీఆర్ఎస్ నేతలు నిజంగా ఉద్యమకారులైతే అమరవీరుల స్థూపం వద్ద ప్రమాణం చేద్దామన్న తమ సవాల్‌ను స్వీకరించాలని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ పదే పదే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు. డబ్బులు, మందు పంచి ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని వాళ్లు ఆరోపిస్తున్నారు. మాపై ఆరోపణలు చేస్తున్న కేసీఆర్‌కు నేను సూటిగా సవాల్ విసిరా. అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి ప్రమాణం చేద్దామని ఆహ్వానించా. కేసీఆర్ రాకపోగా.. అమరుల స్థూపం వద్దకు వెళితే నన్ను అడ్డుకున్నారు. మా సవాల్ స్వీకరించకపోవడంతో.. కేసీఆర్ ఎన్నికల్లో డబ్బు, మద్యాన్ని నమ్ముకున్నారని స్పష్టత వచ్చిందన్నారు.

## చంద్ర ఘంట అలంకారంలో అమ్మవారు



వేములవాడ, అక్టోబర్,17 (మనం న్యూస్) వేములవాడ శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు శ్రీ రాజరాజేశ్వరి దేవి చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండే అర్చకులు శ్రీ రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజన్న ఆల యాన్ని రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిరో జు ఉదయం 5.30ని,,లకు సాయంత్రము. 6.00గం,, లకు శ్రీరాజ రాజేశ్వర అమ్మవారికి శ్రీ సూక్తం దుర్గాసూక్తం ద్వారా లలితా సహ స్రనామ అష్టోత్తర శతనామ సహిత చతుష్షష్ట్యోపచార పూజ జరిపా రు. సాయంత్రం గం.4.00 లనుండి శ్రీ దేవి భాగవతము పురాణం ప్రవచనము జరిగింది.

## రామగుండంలో బిఆర్ఎస్ పార్టీకి పెద్ద షాక్

- కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ కార్పొరేటర్లు, టిబిజికెఎస్ నాయకుల చేరిక



గోదావరిఖని, అక్టోబర్ 17, (మనం న్యూస్): రామగుండం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి అతి పెద్ద షాక్ తగిలింది.గత కొంత కాలంగా బిఆర్ఎస్ పార్టీపై, స్థానిక ఎమ్మెల్యే పై అసంతృప్తిగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు,టిబిజికెఎస్ నాయకులు అధిక సంఖ్యలో చేరినారు. మంగళవారం మాజీ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు మక్కా సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో 46 డివిజన్ కార్పొరేటర్ పాత పెళ్లి లక్ష్మి ఎల్లయ్య, 15 డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్,21 డివిజన్ కార్పొరేటర్ సలీం బేగంలతో పాటు బొగ్గు గని కార్మిక సంఘ నేతలు పెంచాల తిరుపతి, కత్రోజ్ మోహన్,సత్యనారాయణ రెడ్డి, ఇతర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా మక్కాన్ సింగ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## తపాలా బీమా రంగాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శంకరపట్నం, అక్టోబర్ 17, (మనం న్యూస్): తపాల శాఖ నిర్వహిస్తున్న డాక్ కమ్యూనిటీ డెవెలప్మెంట్ కార్యక్రమాన్నిశంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామ పంచాయితీలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ సబ్ డివిజన్ ఏ ఎస్ పి మోహన్, తాడికల్ సబ్ పోస్ట్ మాస్టర్ లింగమూర్తి, ఎం ఓ అనిల్, ఓదెలు మొగిలిపాలెం బిపిఎం రవళి, తాడికల్ ఎస్ ఓ పరిధిలోని బిపిఎం, ఏబిపిఎం మొగిలిపాలెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి మోహన్ మాట్లాడుతూ పోస్టల్ లో ఉండే అన్నీ స్కీమ్ ల గురించి పోస్టల్ లో ఉండే ప్రతి స్కీమ్ వ్యక్తి ఆర్థికభివృద్ధికి, కుటుంబం సంక్షేమానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు, రికరింగ్ డిపాజిట్, సేవింగ్ అకౌంట్, మహిళా సమ్మాన్ అకౌంట్, టైమ్ డిపాజిట్ అకౌంట్, ఇన్సూరెన్స్, వలన లాభాలు, ఆన్ లైన్ ట్రాన్సక్షన్ కోసం ఫోన్ పే లాంటి అకౌంట్స్, లేదా 396 మరియు 399 లతో 10లక్షల ప్రమాద బీమా, స్కీమ్‌ల గురించి వివరించారు.ఈ కార్యక్రమం లోగ్రామ ప్రజలు సుకన్య అకౌంట్స్, రికరింగ్ డిపాజిట్ అకౌంట్స్, సేవింగ్ అకౌంట్స్, గ్రామీణ తపాలా ఇన్సూరెన్స్ పాలసీలు, టాటా, బజాజ్ ఆక్సిడెంట్ పాలసీ మొదలైన పోస్టల్ స్కీమ్లు లో చేరి తపాలా ఖాతాదారులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ కార్యకర్త పాడె మోసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి, అక్టోబర్ 17, మనం న్యూస్ : పార్టీ నాయకుని అంతిమ యాత్రలో మంత్రి దయన్న పాల్గొని పాడె మోసారు. వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోలా రామ్మూర్తి మంగళవారం అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అతని పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ ఇంచార్జి గుడిపూడి గోపాల్ రావు, రాయపర్తి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఉపాధ్యక్షులు గబ్బెట బాబు, సర్పంచ్ నలమాస సారయ్య, కోవూరుమళ్ళ రమేష్ రెడ్డి, గూబ అశోక్, ఉమ్మడి సన్నూరు పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావును భారీ మెజార్టీతో గెలిపించండీ
- మాజీ మంత్రి,ఏఐసీసీ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పెద్దపల్లి, అక్టోబర్ 17, (మనం ప్రతినిధి): అక్టోబర్ 19న పెద్దపల్లి జూనియర్ కళాశాలలో జరిగే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఏఐసీసీ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాహుల్ సభ ఏర్పాట్లపై చర్చించేందుకు గాను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్‌లో కాంగ్రెస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఏఐసీసీ సీనియర్ నాయకులు, పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి మోహన్ జోషి, జిల్లా అధ్యక్షులు, రామగుండం కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, పెద్దపల్లి అభ్యర్థి చింతకుంట విజయరమణారావులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి, ఏఐసిసి సెక్రటరీ దుద్దిళ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ నేడు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బస్సు యాత్ర ములుగు నుండి ప్రారంభమై, 18వ తేది భూపాల్‌పల్లిలో మొదలై మంథనిలో కొనసాగిస్తూ అనంతరం రామగిరిలో కార్మికులు, రైతులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. బస్సు యాత్రలో అనేక మంది సీనియర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోను బీఆర్ఎస్ పార్టీ కాపీ కొటిందన్నారు. కాంగ్రెస్ పార్టీ 6గ్యారంటీ పథకాలతో తెలంగాణ సంపదను తెలంగాణ వాసులకు అందించే విధంగా రూపొందించామని తెలిపారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి మహిళలకు ప్రతి నెలా రూ.2500, గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందిస్తామని, రైతు భరోసా క్రింద ప్రతి సంవత్సరం రూ.15వేలు, రూ.12వేలు కైలు రైతులకు వ్యవసాయ కూలీలకు, వరి పంటకు రూ.500బోనస్ అందిస్తామన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200యూనిట్లు ఇచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి రూ.5లక్షలు అందించనున్నామని తెలిపారు. యువవికాసం క్రింద ప్రతి విద్యార్థికి రూ.5లక్షల విద్యాభరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు ద్వారా ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను ఉచితంగా అందిచనున్నామన్నారు. చేయూత ఫించన్ ప్రతి నెల రూ.4వేలు, రాజీవ్ ఆరోగ్య శ్రీ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.10లక్షలు, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రతను కల్పించనున్నామని మాజీ మంత్రి తెలిపారు. గతంలో రైతులను అనేక మార్లు ఆదుకున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ఉద్యోగస్తులందరికి 1వ తేదీన జీతలు వచ్చే విధంగా, జర్నలిస్టులందరికి జిల్లా స్థాయి, మండల స్థాయిలో ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఏఒక్కటీ కూడా నెరవేర్చలేదని, కాంగ్రెస్ పార్టీ మెనిఫేస్టోను బీఆర్ఎస్ పార్టీ కాపీ చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాయమాటలను నమ్మవద్దని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి అభ్యర్థి చింతకుంట విజయరమణారావు భారీ మోజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈసమావేశంలో కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కేసీఆర్ పథకాలు... ప్రతి ఇంటికి ధీమా

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు
- బోయినపల్లి వినోద్ కుమార్



తిమ్మాపూర్, అక్టోబర్ 17, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య శ్రేణులు, నాయకులు, వాలంటీర్లు, కార్యకర్తల సమావేశంను మంగళవారం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల రమేష్ అధ్యక్షతన కొత్తపల్లిలోని ప్రవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, మానకొండూరు ఎమ్మెల్యే డా. రసమయి బాలకిషన్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జి.వి రామకృష్ణారావు లు హాజరైనారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, వాలంటీర్లు, కార్యకర్తలను ఉద్దేశించి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూతెలం గాణ ఉద్యమానికి ముందు తెలంగాణలో పరిస్థితులు ఏ విధంగా ఉండేవో ఒకసారి గుర్తు చేసుకోవాలని, గతంలో తెలంగాణలో భూగర్భ జలాలు అడుగంటి, త్రాగు,సాగు నీరు లేక వ్యవసాయ రంగానికి సరైన విధంగా కరెంటు సరఫరా లేక పంటలు ఎండిపోయే పరిస్థితుల్లో పంటల్ని కాపాడుకోవడానికి రాత్రి వేళల్లో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి కరెంటు మోటార్లు ఆన్ చేసుకోవాల్సి వచ్చేదని, అలాంటి పరిస్థితుల నుండి తెలంగాణ వచ్చాక నేడు వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని, గత కాంగ్రెస్ హయాంలో 60 ఏళ్ల పాలనలో తెలంగాణలో కేవలం ఒక్క ప్రాజెక్టు మాత్రమే కట్టిందని, అలాంటిది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో కాళేశ్వరం లాంటి ఎన్నో ప్రాజెక్టులు, రిజర్వాయర్లను నిర్మించి, కాలువల ద్వారా తెలంగాణలో వ్యవసాయ రంగానికి సాగునీరు అందించి, లక్షరా ఎకరాల్లో పంటలను పండించి, రికార్డ్ స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేసి, దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలబ డిందని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చే విధంగా భరోసా కల్పించారు. కావున సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, బిఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిని గ్రామ గ్రామాన, బూత్ స్థాయిలో ప్రజలకు, ప్రతి ఒక్క ఓటరుకు, ముఖ్యంగా యువతకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీలో వర్గ బేధాలను మరిచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వాలంటీర్లు సమిష్టిగా కలిసి మెలిసి బిఆర్ఎస్ పార్టీని బలపరిచి, ఎమ్మెల్యే అభ్యర్థిగా డా.రసమని గెలిపించే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావుతో పాటు ముఖ్య నాయకులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్పల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఇనుకొండ జితేందర్ రెడ్డి, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, సల్ల రవీందర్, సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామి రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, సర్పంచ్ రావుల రమేష్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు, సర్పంచ్ బోయిని కొమరయ్య, వైస్ ఎంపీపీ ఎల్ వీరారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, సర్పంచులుమీసాల అంజయ్య, వై వెంకటేశ్వరరావు, మేడి అంజయ్య, ధనమనేని నర్సింగరావు, దుంద్ర రాజయ్య, నాయిని వెంకటరెడ్డి, పొన్నం అనిల్ గౌడ్,రెడ్డి తిరుపతి రెడ్డి లతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా కేసీఆర్ మ్యానిఫెస్టో

- మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాం
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, అక్టోబర్ 17, (మనం న్యూస్): తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా,పేద ప్రజలను అక్కున చేర్చుకునే లా, సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టో ఉందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం ఓసిపి ఫైవ్ వద్ద గల మైసమ్మ అమ్మవారి దేవాలయంలో హోమం నిర్వహించి,ఎన్నికల ప్రచారం చెపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఉద్యమమే ఊపిరిగా 2001లో తెలంగాణ ఉద్యమం ప్రస్థానంలో అలుపెరగని పోరాటం సాగించామ న్నారు.2009లో కేసీఆర్ మహాకూటమి అభ్యర్థిగా తమకు బీఫామ్ అందజేశారని, 2023 లో తిరిగి రెండవసారి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తమకు బీఫామ్ అందజేసినారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటామని, బీఆర్ఎస్ పార్టీలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలు తీర్చి, వారిని కంటికి రెప్పలా కాపాడుతుంది బిఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. టిడిపి, కాంగ్రెస్ హయాంలో సింగరేణి వ్యాప్తంగా పోయిన వారసత్వ ఉద్యోగాలను తిరిగి కారుణ్య నియామకాల ద్వారా సింగరేణి కార్మికుల వారసులకు అందించిన ఘనత కెసిఆర్ దని తెలిపారు.సింగరేణి సంస్థలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించింది కూడా కెసిఆర్ ప్రభుత్వమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో సబ్బండ వర్గాల అందరికి సంక్షేమం లక్ష్యంగా ఉందన్నారు. రైతు బీమా తరహాలో కెసిఆర్ బీమా,ఇంటికి భీమా పథకం,కల్యాణ లక్ష్మి, గృహలక్ష్మి, కెసిఆర్ కిట్, మిషన్ భగీరథ లాంటి మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలు తరహాలో నేడు దేశంలో ఎక్కడ లేని విధంగా పేద మహిళల కోసం సౌభాగ్య లక్ష్మి పథకం తీసుకువచ్చిన ఘనత కేసీఆర్ దని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంక్షేమానికి కృషి చేస్తున్న కేసీఆర్ ని హ్యాట్రిక్ ముఖ్యమంత్రి చేయాలనీ,రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రామగుండం నియోజకవర్గంలో తమను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చందర్ కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు గంద్ర దామోదర్ రావు,మండ రమేష్ గౌడ్, జహీద్ పాషా, కార్పోరేటర్ దొంత శ్రీనివాస్,బాదె అంజలి తదితరులు పాల్గొన్నారు.

## గని కార్మికులతో రాహుల్ గాంధీ ప్రత్యేక సమావేశం




నస్పూర్, అక్టోబర్ 17, (మనం న్యూస్): సింగరేణి గని కార్మికుల సమస్యలు తెలుసుకోవడానికి వారితో ప్రత్యేక సమావేశం రాహుల్ గాందీతో ఉంటుందని ఐఎన్‌టియుసి లీడర్లు తెలిపారు. మంగళవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, రామగుండంకు ఈ నెల19న వస్తున్న రాహుల్ గాంధీ గని కార్మికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రయత్నాలు చేస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ 9ఏళ్ల పాలనలో ఉద్యోగులకు ఏమీ చేసింది లేదని 30శాతం ఇన్కం టాక్స్, 12శాతం సీఎంపీఎఫ్, 7శాతం పెన్షన్ కోసం కట్ చేస్తుంటే ప్రకృతికి విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు దాదాపు 50శాతం కట్ చేస్తే ఇంకా జీతాలు ఎక్కడ అని ప్రశ్నించారు. కాకా వెంకటస్వామి కృషితో మొదలైన పెన్షన్ ఇప్పటికి అదే కోనసాగుతుందని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు సరైన జీతాలు అందడం లేదని, కోల్ ఇండియాలో అమలవుతున్న జీఓలు ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గని కార్మికులకు సోంతింటి పథకం ఎందుకు అమలు చేయాడం లేదో తెలపాలన్నారు. సింగరేణి సంస్థ నుండి డిఎంఎఫ్టీ, సిఎస్ఆర్ నిధులు తీసుకుంటున్న ప్రభుత్వం గని కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో లీడర్లు శంకర్ రావు, కలవేణ శ్యామ్, స్వామి, సమ్మ రాజయ్య, రవి, వెంకటేష్, శ్రీనివాస్, మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మార్షల్ యువజన సంఘం ఆధ్వర్యంలో 50 అడుగుల భారీ రావణాసురుడు

కాజీపేట, అక్టోబర్ 17, మనం న్యూస్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46 వ డివిజన్ మడికొండ మెట్టుగుట్ట వద్ద మా ర్షల్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో భారీ రావణాసురుడి ప్రతి మ ముస్తాబు పనులు ప్రారంభమయ్యాయి. మార్షల్ యూత్ వారు ప్రతి ఏటా నిర్వహించే దసరా మెత్సవంలో మెట్టుగుట్ట పోచమ్మ గుడి వద్ద, ఈ సంవత్సరం 50 అడుగుల రావణాసురుడి ప్రతిమను ఏర్పాటు చేస్తున్నా మని కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్షల్ యూత్ అసోసి యేషన్ సభ్యులు విశాల్ నాయక్, దువ్వ వినయ్, గూటం కుమార్, ఖాన్‌బై, ఉద్దండి రాకేష్, దాస్యం వికాస్, మోడెమ్ పూర్ణ చందర్, కార్తీక్, కిన్నెర మధు, అద్దెపల్లి అనిల్, మాట్టేపల్లి భరత్, మట్టేపల్లి హేమం త్, హరీష్, కొలిపాక కష్ణ, ఆవుల శ్రీకాంత్, రఘువరన్ తదితరులు పాల్గొన్నారు.



## పొనుగోటి పెద్ద మనసు

- అంబేద్కర్ సంఘ భవనానికి చేయూత



వెల్గటూర్,అక్టోబర్ 17 (మనం న్యూస్): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు మరోసారి స్వగ్రామం పాత గూడూరు గ్రామం పై తన మమకారాన్ని చాటారు.స్వగ్రామం పాత గూడూరు గ్రామంలో అంబేద్కర్ సంఘ యువత నూతన సంఘ భవనాన్ని నిర్మించాలని పీఎస్ఆర్ (బాపు) ను కలసి కోరగా తక్షణమే స్పందించి నూతన భవనాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనుకున్నదే తడవుగా స్వతహాగా 5 లక్షల రూపాయల వ్యయంతో మంగళవారం నిర్మాణ పనులను ప్రారంభించడంతో అంబేద్కర్ యువత హర్షం వ్యక్తం చేస్తూ పిఎస్అర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో పూసల, కుమ్మరి ,మాల ,యాదవ సంఘ భవనాలకు, నూతన పంచాయతి, వైకుంఠ ధామం, సబ్ స్టేషన్ నిర్మాణాలకు, గ్రామంలో అంబేద్కర్ విగ్రహా ఏర్పాటు తో పాటు తన వంతు ఆర్థిక సహకారాన్ని అందించారు. గ్రామంలోనే కాక ఉమ్మడి వెల్గటూర్ మండల వ్యాప్తంగా ఎంపీపీ గా, స్వతహాగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యమై ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

## బీఎస్పీలో ప్రజాప్రతినిధులు

- విద్యావేత్తలు, వివిధ పార్టీ నాయకులు చేరిక
- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష



పెద్దపల్లి, అక్టోబర్ 17, (మనం ప్రతినిధి): బీఎస్పీలో ప్రజాప్రతి నిధులు, విద్యావేత్తలు, వివిధ పార్టీ నాయకులు భారీగా చేరారు. పెద్దపల్లి స్వగృహంలో మంగళవారం వారికి పార్టీ కండువా కప్పి దాసరి ఉష సాదరంగా ఆహ్వానించారు. అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ పట్టణంలో మద్రిపల్లి సతీష్-శైలజ మాజీ కౌన్సిలర్ (మాజీ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ పెద్దపల్లి టౌన్) పెద్దపల్లి మాజీ పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు తిర్రి సుధాకర్‌గౌడ్, వివిధ పార్టీల నుండి భారీగా బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో బీఎస్పీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేష్ పటేల్, అసెంబ్లీ కోకన్వీనర్ దేశబోయిన అఖిల, పెద్దపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండి అజీమ్, శ్రీరాంపూర్ మండలాధ్యక్షులు కుమ్మరికుంట రవికుమార్, ఓదెల మండలాధ్యక్షులు బీరం రవి, మాటూరి రవి, పిట్టల శివ, దొడ్డి అశోక్, తూడి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎసిపి రఘు చందర్



రాయపర్తి, అక్టోబర్ 17, మనం న్యూస్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిపేందుకు ఓటర్లు భయాందోళనలకు గురి కాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగం చేసుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం ఏసిపి రఘుచందర్ పోలింగ్ బూత్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు తగు సలహాలు సూచనలు అందించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ రాయపర్తి ఎస్సై విజయ్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరికలు





- విविధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నాయకులు
- పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క

ములుగు వెంకటాపూర్, అక్టోబర్ 17, (మనం న్యూస్) : ములుగు జిల్లా వెంకటపూర్ మండలం జవహర్ నగర్ గ్రామంలో మండల అధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేయగా అట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క విచ్చేసి వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేవారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రజా సమస్యల్లో నిత్యం పోరాటం చేస్తూ ప్రజల కష్టాలను తీర్చాలని ఒక ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా అధికార పార్టీపై పోరాటం చేస్తూనే ఉన్నానని, నిత్యం ప్రజా కష్టాల్లో ప్రజలకు అండగా నిలబడి కరోనా కాలంలో, వరదల వల్ల నష్టపోయిన బాధితులకు సహాయం అందిస్తూ ములుగు ప్రాంత సమస్యలపై పోరాడుతూనే ఉన్నానని అన్నారు. ప్రతి క్షణం కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తూ ఉన్నానని, అలాగే ఇప్పుడు అధికార పార్టీలో ఉండి అత్యున్నత పదవులు పొందినా కూడా ప్రజల కష్టాలను పట్టించుకోలేదని, ఇప్పుడు ఎన్నికల సమయం రాగానే ఓట్ల కోసం నాటకాలాడుతూ మోసం చెయ్యడానికి వస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో కానీ, వరదల సమయంలో కానీ, వడ్ల కొనుగోలు విషయంలో కానీ ఏ రోజు ప్రజల్లోకి రాని నేతలు ఈ రోజు వచ్చి ఓట్ల కోసం డ్రామాలాడుతున్నారని అన్నారు. పేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ, పేదల పక్షాన నిలబడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, గృహలక్ష్మి పథకం కోసం అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలని అన్నారు. దళిత ముఖ్యమంత్రి అని చెప్పి యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, 1200 మంది విద్యార్థుల ఆత్మ బలిదానం వల్ల వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం గద్దెనెక్కి రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని, ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్య, దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తా అని, అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తానని నమ్మించి మోసం చేశారని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎన్నో సంక్షేమ పథకాలు పేదలకు చేరువయ్యాయని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా జల ప్రభ ద్వారా బోర్లు, పంట రుణాలు, లక్ష రూపాయల రుణమాఫీ, ఫీజ్ రీ ఎంబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ, ఉచిత విద్యుత్, ప్రాజెక్టులు, కల్వర్టులు, పాఠశాలలు, కళాశాలలు అన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే జరిగాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించడానికి వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి విచ్చేసిన వారికి అందరికీ నా తరుపున కతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. మంగళవారం వివిధ పార్టీల నుండి 20 కుటుంబాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీ పోరాటాలలో భాగం అయినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, వెంకటపూర్ మండల జిల్లా నాయకులు, మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకురాల్లు, కార్యకర్తలు తదితర నాయకులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌లో చేరిక



పాలకుర్తి, అక్టోబర్ 17, (మనం న్యూస్) : రాష్ట్ర ఆపధర్మ ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బిఆర్ఎస్ పార్టీలో చేరినారు. వారికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్రమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన, కూటికంటి నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మునిగే నరేష్, పూజారి రజినీకాంత్, పులి సదయ్య గౌడ్, పులి ప్రశాంత్, జీడి సంజయ్, చారగొండ్ల రాజు, పూజారి సతీష్ ఈర్ల పర్శరాములు, ఎండి షామిశ్ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్రపంచాయతీరాజ్ గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతనంగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రైతు కోఆర్డినేటర్, పాలకుర్తి సర్పంచ్ వీరమనేని యాకాంతరావు, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్, ముస్కు రాంబాబు, చీలివేరు పెంటయ్య, తిరుమలగిరి మాజీ సర్పంచ్ కూటికంటి రాజు, స్సొసెటీ డైరెక్టర్ ఈర్ల రాజు, తిరుమలగిరి గ్రామ పార్టీ ఉప సర్పంచ్ బక్క నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు కూటి కంటి పర్శరములు, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి కౌడగాని సుధాకర్, మండల యూత్ నాయకులు మామిండ్ల శోభన్ బాబు, తిరుపతి నాయక్ గజ్జి సంతోష్ కుమార్ మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## 24 వ వార్డుకు చెందిన యువత బిఆర్ఎస్ పార్టీలో చేరిక



నర్సంపేట, అక్టోబర్ 17, (మనం న్యూస్): నర్సంపేట పట్టణంలోని 24 వ వార్డుకు చెందిన యువత నేడు కాంగ్రెస్ పార్టీ నుండి నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరినారు. పార్టీలో చేరినవారిలో రేవెల్లి శ్రీరామ్, పసుల వికాస్, పసుల పవన్, గద్ద మహేష్, ఎరుకల శివ, గునిగంటి శశి, జెట్టిశ్రవణ్, మెడి మణికంఠ, నూనె రోహిత్, బేతం సాయి, గొర్రె వినయ్ ఉన్నారు. వీరిని 24వ వార్డు కౌన్సిలర్ దార్ల రమాదేవి, వార్డు అధ్యక్షులు పెరుమండ్ల రవి, వార్డు యూత్ అధ్యక్షులు బొల్లపెల్లి కమల్ కుమార్, యూత్ సభ్యులు తదితరులు పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మృతుని కుటుంబానికి పద్మశాలి వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



పాలకుర్తి, అక్టోబర్ 17, (మనం న్యూస్): మండలంలోని వల్మిడి గ్రామ పద్మశాలి కోడం సోమ నరసయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించగా కుటుంబానికి మంగళవారం శ్రీ సోమనాథ పద్మశాలి వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ సోమనాథ పద్మశాలి వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మాచర్ల సారయ్య, కార్యదర్శి దేవసాని కపాకర్, కోశాధికారి కూర పాటి సుదర్శన్, గూడూరు గ్రామ మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు రాపోలు తిరుపతి, వల్మిడి గ్రామ పద్మశాలి కుల నాయకులు భారత శ్రీనివాస్, భారత మనోహర్, భారత సోమనారాయణ, చిలుక మారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇవ్వండి

- ఇచ్చిన హామీలను అధికారం లోకి వచ్చిన 90 రోజులలో కచ్చితంగా అమలు చేస్తాం
- హామీ ఇచ్చిందంటే కచ్చితంగా చేసి చూపించే పార్టీ కాంగ్రెస్ పార్టీ
- మాట తప్పే అలవాటు కాంగ్రెస్ పార్టీ కి లేదు
- అన్నీ వర్గాల ప్రజలకు అండగా ఉండేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే
- మంగపేట మండల బీసీ సెల్ అధ్యక్షులు టీవీ హిదైయతుళ్ళ



ములుగు, అక్టోబర్ 17, (మనం న్యూస్): తెలంగాణ ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మంగపేట కేంద్రంలో అల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ పటేల్ ఆదేశాల మేరకు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదయాతుళ్ళ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రజలకు వివరిస్తూ హైదరాబాదులోని తుక్కుగూడలో జరిగిన బహిరంగ సభలో ప్రవేశపెట్టిన గ్యారెంటీ హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఖచ్చితంగా అమలు చేసే సంక్షేమ పథకాలు 6 గ్యారంటీ పథకాలు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల 2500, 500కి గ్యాస్ సిలిండర్ మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి 15 వేల రూపాయలు పెట్టుబడి సహాయం వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు సంవత్సరానికి 500 రూపాయలు వరి పంట కు పంట బోనస్, గృహ జ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి 2 యూనిట్ల విద్యుత్తు ఫ్రీ, ఇందిరమ్మ ఇండ్లు ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇంటి స్థలం, 5 లక్షల రూపాయలు ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం, యువ వికాసం పథకం కింద విద్యార్థులకు 5 లక్షల రూపాయల విద్యా భరోసా కార్డు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్, చేయూత పథకం కింద 4 వేల రూపాయలు వద్దులకు నెలవారి పింఛన్లు, 10 లక్షల రూపాయల రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తుక్కుగూడ సభలో తెలంగాణ తల్లి సోనియా గాంధీ ప్రకటించిన హామీలను గడపగడపకు వివరించారు, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హిదయత్తుల్లా, ఎస్టీ సెల్ మండల అధ్యకులు చాద మల్లన్న, గ్రామ అధ్యక్షులు సదయ్ హుస్సేన్, మండల సీనియర్ నాయకులు బెత నర్సింహారావు, గుగ్గిళ సురేష్, ఎల్పి రాజారత్నం, తిప్పని నారాయణ, మదనమ్మ, సమ్మక్క, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి 85 కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట, అకోబర్ 17, (మనం న్యూస్): నర్సంపేట మున్సిపల్ 16వ వార్డు నుండి 85 కుటుంబాలు నేడు నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలోకి చేరినారు. సింగిరెడ్డి స్వరూప, మేడిద లావణ్య, మేడిద యాకన్న, చామంతుల రమేష్, చామంతుల రేణుక, రాళ్ల బండి చంద్రయ్య, రాళ్ల బండి తార, రాళ్ల బండి సాగర్, రాళ్ల బండి శ్రీలత, సంకినేని మహేందర్, సంకినేని జయసుధ, నీరటి సారమ్మ, రాళ్ల బండి నరేష్, రాళ్ళబండి సుష్మ, రాళ్ల బండి నాగభూషణం, రాళ్ల బండి సురేష్, మురహరి సాగర్, బరిగల సురేష్, బరిగెల అశ్విని, మాదాసి తేజ, మాదాసి సదానందం, వనపర్తి సతీష్, బొచ్చు వరమ్మ, బొచ్చు సరిత, కంజర్ల అనూష, రాథోడ్ సురేష్, రాథోడ్ సీత, గొర్రె అనిల్, బోడ రవి, గొర్రె సుకుమార్, గొర్రె దక్రి, అల్వాల మోహన్, బొట్ల యశోద, బొట్ల కొమరయ్య, చిలుక సాంబయ్య, గణిపాక శ్రీనివాస్, చిలుకా అశోక్, చిలుక సదయ్య, బొట్ల కుమార్, చిలుక నరసయ్య, చిలుక లచ్చమ్మ, మాదాసి మమత, చిలుక శంకర్, చిలుక లలిత, బడితే రాజు, ములుగురి సుమలత, గాదే కావేరి, మంద కల్పన, దుర్గం లలిత, పసునూరి స్వామి, పడిషాల శ్రీనివాస్, పెండ్యాల శ్రీనివాస్, అల్వాల శ్రీలత, ములుగురి అన్నమ్మ, ఎర్ర మహేష్, ఎర్రం రాజేశ్వరి, పోగుల కర్ణ, సానేపల్లి సరిత, అన్నపూర్ణ, ప్రవళిక, రాయుడు సూరిబాబు, అంకాల సారాకట్టయ్య, సులంకి అంకుష్, గనిపాక ప్రశాంత్, సోలంకి శ్యామ్, జమున, జావాన్ మంగళ్, సూర్య, పడిసాల స్పందన, బోడ రవి, సోలంకి శ్యామ్, బోడ రవి, సోలంకి శ్యామ్, భారతీ, తరుణ్, రమేష్, శివాజీ, ఆగారాపు రవి, అలువాల స్వామీ, సోమారపు శ్రీధర్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరిని 16 వ వార్డు కౌన్సిలర్ వేల్పుగొండ పద్మ రాజు, నర్సంపేట పట్టణ పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు, క్లస్టర్ బాధ్యులు, ముఖ్య నాయకులు పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సేంద్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే లాభాలు మెండు





రాయపర్తి, అక్టోబర్ 17, (మనం న్యూస్): బాలాజీ గోశాల ఆధ్వర్యంలో బంధనుపల్లి గ్రామం మండలం రాయపర్తి లో లేగ దూడలు పంపిణీ కార్యక్రమం జరిగింది. 10 మంది రైతులకు లేగ దూడలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో గోసంతతి అంతరించిపోతుందని, రైతులు గోవులను పెంచడం వలన వాటి నుండి వచ్చే పేడ, మూత్రం ద్వారా సేంద్రియ పద్ధతుల తోపంటలు పండించినట్లయితే భూసారం పెరుగుతుంది ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెస్టిసైడ్ వాడడం వలన భూసారం దెబ్బతిని అనేక భయంకరమైన వ్యాధుల చేత ప్రజలు ఎంతగానో ఇబ్బంది పడుతున్నారు చిన్నపిల్లల నుండి మొదలుకొని వద్ధుల వరకు అనేక రకాలైన కొత్త కొత్త వ్యాధులతో బాధపడుటకు ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారం, వాటిలో కలిసే విషపూరితమైన ఫెస్టిసైడ్స్ కావున గ్రామీణ ప్రాంతంలో రైతులు ఆరోగ్యకరమైన రాష్ట్రంగా నిర్మించాలని ప్రతి ఒక్క కుటుంబం గోవును సాదుకోవడానికి ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రజలు కూడా ముందుకు వచ్చి దేశ రాష్ట్ర సంరక్షణలో భాగస్వాములు కావాలని అగర్వాల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ దుర్గం రోజా, గ్రామ సర్పంచ్ దీప్లా నాయక్, గోశాల ప్రతినిధులు రాజేష్, గోశాల కార్యదర్శి రవీందర్, వార్డ్ మెంబర్ దేవ్యా పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్‌లోకి చేరిక



నర్సంపేట, అక్టోబర్ 17, (మనం న్యూస్): నర్సంపేట పట్టణంలోని 1 వ వార్డుకు చెందిన 15 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నుండి నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరినారు. పార్టీలో చేరినవారిలో మేక వెంకన్న, బోల్లు రాములు, బోల్లు వెంకటేష్, పాలడుగుల సమక్క, జెట్టి ప్రవీణ్, జెట్టి వరలక్ష్మి, మేక రత్నా, తోట మంజుల, బొల్లు చంద్రం, దనబోయిన పద్మ, కిస్టోజు స్వాతి, ప్రణయ్ జి, మహేష్ జి, బోల్లు మంగమ్మ, దనబోయిన పీరయ్య, బిల్లు రజిత ఉన్నారు. వీరిని 1 వ వార్డు కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొల్లాపురం రాజేశ్, యూత్ అధ్యక్షులు కుసుంభ నిరంజన్, కార్యదర్శి కోల రమేష్, ప్రచార కార్యదర్శి దేంచనాదుల సతీష్, పట్టణ ఎస్సీ సెల్ కోశాధికారి ఎర్ణం మధు, గదే శ్రీను, దండు సాయి, శిరంశెట్టి నగేష్, ఆసం విజయ్, కందకట్ల సతీష్, గడ్డం వినయ్ తదితరులు ఫాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కి చెందిన కుటుంబాలు బిఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట, అక్టోబర్ 17, (మనం న్యూస్) : నర్సంపేట పట్టణం 4వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు మంగళవారం నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి మక్షంలో బిఆర్ఎస్‌లో చేరినారు. పార్టీలో చేరినవారిలో రాపోలు సమ్మయ్య, ఆలుకుంట మురళి, శివరాల కొమ్మాలు, బోసుసమ్మయ్య, శివరాత్రి దర్గయ్య, శివరాత్రి సారయ్య, శివరాత్రి మల్లమ్మ, సంపంగి సరోజన, సంపంగి మల్లయ్య, దండుగుల శివ, ఆలుకుంట నర్సమ్మ, రాపోలు తిరుపతమ్మ, బోసు ఐలమ్మ, రాపోలు ఎల్లమ్మ, పల్లపు శిరీష, ఆలుకుంట శ్రావణి, సంపంగి చిలకమ్మ, సంపంగి వంశీ, రాపోలు పండు, సంపంగి మల్లయ్య, సంపంగి మల్లయ్య, సంపంగి మల్లికాంభ, శివరాత్రి లక్ష్మీ, గండికోట అయిలయ్య, ఓర్సు నాగరాజు ఉన్నారు. వీరిని పట్టణ పార్టీ అధ్యక్షులు నాగేల్లి వెంకట నారాయణ గౌడ్, నల్ల మనోహర్ రెడ్డి, సంపంగి సాలయ్య, రాపోలు వెంకటస్వామి తదితరులు పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

## యువత అంతా బిఆర్ఎస్ వైపు

- ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



వరంగల్, అక్టోబర్ 17, (మనం న్యూస్): వరంగల్ యూత్ అంత బిఆర్ఎస్ వైపు ఉన్నారని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు.12వ డివిజన్ యూత్ నాయకులు సిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ నుండి వసంత్, సాయి వారి మిత్ర బందం సోమవారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే నన్నపునేని చేసిన అభివద్ధికి ఆకర్షితులై కేసీఆర్ నాయకత్వాన మరో మారు నరేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కంకనబద్ధులై బిఆర్ఎస్‌లో చేరడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటానని వారికి అండగా ఉండి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## ఎన్నికల ఖర్చు నిమిత్తం ఎమ్మెల్యేకు చందా అందించిన రిటైర్డ్ ఉద్యోగి



వరంగల్, అక్టోబర్ 17, (మనం న్యూస్): రాబోవు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు విశ్వనాథ కాలనీకి చెందిన రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి చెలుమెల్ల సత్యనారాయణ ఎన్నికల ఖర్చు కోసం మొట్టమొదటి చందా 2016 రూపాయలు అందించి ఎమ్మెల్యే నరేందర్ గెలుపును కాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ సత్యనారాయణకి కతజ్ఞతలు తెలిపారు.

## పూల మొక్క అందజేత

- పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూరకంగా కలిసిన బల్దియా కమీషనర్




వరంగల్, అక్టోబర్ 17, (మనం న్యూస్) : నగర పోలీస్ కమిషనర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝూను బల్దియా కమీ షనర్ షేక్ రిజ్వాన్ భాషా మంగళ వారం పోలీస్ కమిషనరేట్ కార్యాల యంలో మ ర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# సిద్దిపేట వజ్రపు తునక

- ఇక్కడికి రాందేది.. లేందేది..
- ఉద్యమానికి పునాది వేసింది సిద్దిపేట
- రాష్ట్రానికే తలమానికం
- ఎక్కడ ఉన్నా మిమ్మల్ని మరువ
- ఆరడుగుల బుల్లెట్టు అద్భుతం చేసిండు
- ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు





సిద్దిపేట, అక్టోబర్ 17, (మనం న్యూస్): ప్రతినిధి ఎట్లుండె సిద్దిపేట ఎట్లయ్యింది... ఇయ్యాళ్ల సిద్దిపేటకు రానిదేది...? ఇక్కడ లేనిదేది...? ఒక్క గాలిమోటారు తప్ప అన్నీ వచ్చాయి. రాబోయే రోజుల్లో సిద్దిపేట వజ్రపు తునక కాబోతుంది. హరీష్‌రావు స్థానంలో నేనున్నా ఇంత చేసేవాన్ని కాదేమో...! అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పురిటి గడ్డపై అడుగుపెట్టి జనసంద్రాన్ని చూసి పులకించిపోయి మాట్లాడిన మాటలివి. జన్మభూమిని మించింది లేదు.. సిద్దిపేట పేరు వింటేనే ఒక రక మైన పులకింత. సాదింది మీరు... పెద్దను చేసింది మీరు... రాజకీయ జన్మనిచ్చింది మీరు.. సీఎం అయ్యేంత ఎత్తుకు పెంచింది మీరంటూ సిద్దిపేటతో తనకున్న అనుబంధాన్ని, సిద్దిపేట ప్రజలంటే తనకున్న మమకారాన్ని, పుట్టిన భూమితో తనకున్న బంధాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. అవసరమైన ప్రతి సందర్భంలో విజేతగా నిలిపారు. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో పేర్లు ఇప్పటికీ యాదున్నాయి. మంచినీళ్ల కరువొస్తే ట్యాంకర్లతో నీళ్లు తెచ్చుకున్న పరిస్థితి నుండి రంగనాయక సాగర్‌వంటి అద్భుత ప్రాజెక్టును సాధించు కున్న సందర్భం వరకు అనేక జ్ఞాపకాలు. ఎల్‌ఎండి నుండి నీళ్లు తెచ్చు కొని నాడు జలజాతర చేసుకున్న సందర్భమే నేటి మిషన్ భగీరథకు నాంది ......అంటూ సిద్దిపేటపై తనకున్న ప్రేమను , హరీష్‌రావు అభి వృద్ధిని మెచ్చుకుంటూ కేసీఆర్ మాట్లాడుతుంటే జనమంతా పులక రించిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నాడు ముస్తాబాద్ రోడ్డులోని శివాజీ చౌక్ సమీపంలో సిద్దిపేట ప్రగతి ప్రజా ఆశీర్వాద సభ పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ తాను తిరగని ఊరు లేదు, తాను చూడని చెరువు లేదు... ప్రతీ గల్లీ తనకెంతో అనుబంధమన్నారు. నాడు సమైక్యవాద కుట్రలను ఛేదించేందుకు తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకొని బస్సు గుర్తుతో మీ ముందుకు వస్తే సమైక్య వాదులు విసిరిన నోట్ల కట్టలను దాఖలు చేయక ఉద్యమానికి పునాది వేసింది ఈ గడ్డ అన్నారు. తాను ఎక్కడ వెళ్లినా సిద్దిపేటను మరువలే. కోనాయిపల్లి వెంకటేశ్వరుని పాదాల చెంత నామినేషన్‌లు ఉంచి బయల్దేరిన ప్రతి సందర్భంలో విజయమే వరించింది. సిద్దిపేటను వదిలి ఎంపిగా గెలిచిన సందర్భంలో ఎట్లా అని అందరం కలిసి ఏడ్చిన రోజులు యాదికున్నాయి. అంతలోనే ఆరడుగుల బుల్లెట్టు హరీష్‌ను మీకప్పగిస్తే సిద్దిపేట ఖ్యాతి ఇసుమంత తగ్గించ కుండా నేడు అభివృద్ధిలో శిఖరాగ్రంలో నిలిపాడన్నారు. ఒక దశలో అని పిస్తుంది... హరీష్‌రావు స్థానంలో నేనున్నా ఇంత చేసేవాన్ని కాదేమో...! ఒకనాడు తాగునీళ్ల కోసం కన్నీరుకార్చిన సిద్దిపేట నేడు చుట్టూ జలాశ యాలతో కళకళలాడుతూ ఈప్రాంతం పచ్చని పంటలతో పులకించిపోతుందన్నారు. నాటి ఎన్నికల నినాదాలన్నీ నేడు నిజమయ్యాయి. ఒక్క గాలి మోటారు మినహా ఇంకా రావాల్సిందేముంది. రాష్ట్రంలోనే ప్రత్యేక గౌరవాన్ని సిద్దిపేటకు తీసుకువచ్చాడు. గతంలోనే రికార్డు మెజార్టీతో హరీష్ రావును ఆదరించారు. మరోమారు రికార్డు బద్దలు కొట్టే ఘనత మళ్లీ మీకే దక్కాలన్నారు. దళితబంధుకు ప్రేరణ రామంచ ఆడబిడ్డ. దిక్కుమాలిన కాంగ్రెస్ పాలనలో చేసిందేమీ లేదు. దళిత సమాజానికి ఒకటే చెబుతున్నా.... ప్రాణం పోయినా చివరి కుటుంబం వరకు దళితబంధు అందించేందుకే ప్రయత్నిస్తా. చితికిపోయిన బిసి కులాలకు చేయూతనందించే బిసిబంధు నిరంతర ప్రక్రియ. ఎవరూ అధైర్య పడొద్దు... వర్తక వ్యాపార, ఐటి కేంద్రంగా సిద్దిపేట బాసిల్లుతోంది. మరోమారు సిద్దిపేట పేరు మారుమోగేలా హరీష్‌రావును దీవించం డంటంటూ తన ప్రసంగాన్ని ముగించారు కేసీఆర్. ఈ కార్యక్రమంలో జెడ్పి ఛైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మున్సిపల్ ఛైర్మన్ మంజుల రాజనర్సు, సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు సంపత్‌రెడ్డి, ఏఎంసి ఛైర్మన్ మచ్చ విజిత వేణుగోపాల్‌రెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు వంగ నాగిరెడ్డి, జంగిటి కనకరాజు, పాలసాయిరామ్, చిన్న, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెన్నమనేని కిషన్‌రావు, నిమ్మ రజనీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు చెమటలు పట్టిస్తున్న కాట శ్రీనివాస్ గౌడ్

- కాంగ్రెస్ పార్టీలో చేరిన ముఖ్య నాయకులు
- పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన కాటా శ్రీనివాస్‌గౌడ్



గుమ్మడిదల, అక్టోబర్ 17, (మనం న్యూస్): గుమ్మడిదల మండలం రాంరెడ్డి బావి గ్రామం ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రవీందర్ రెడ్డి, వార్డు మెంబర్ శ్రీకాంత్ గౌడ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ చంద్రారెడ్డి, నాయకులు డి. హర్షవర్ధన్‌రెడ్డి, యాదిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, నవీన్‌రెడ్డి, కాంగ్రెస్‌లో కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలువబోతుందని, మహి పాల్‌రెడ్డి అహంకారాన్ని ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు నర్సింగ్‌రావు, ఎంపిటిసిలు నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, ట్రెజరర్ మహిపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ బాలకృష్ణ గౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ దయాకర్‌రెడ్డి, శంకర్, గ్రామ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, యూత్ అధ్యక్షులు రాజు, వర్మ పాల్గొన్నారు.

## యోగా గురువు బీర్కూరి మనోహర్‌కు ఘన సన్మానం



చేర్యాల, అక్టోబర్ 17, మనం న్యూస్: యోగా గురువు బీర్కూరి మనోహర్‌ను పతంజలి యూనివరిసటీ హరిద్వార్, పతంజలి యోగా పీట్ భారత్ స్వామి ట్రస్టు కేంద్రీయ ప్రబారి పూజ్య స్వామి డాక్టర్ పరమార్ధదేవ్‌లు ఘనంగా సన్మానించారు. గజ్వేల్‌లో మంగళవారం నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ యోగ శిక్షణ శిభిరంలో బీర్కూరి మనోహర్‌ను సన్మానించారు. సమాజంలో వ్యక్తిత్వ వికాసం శారీరక మానసిక వికాసం కోసం యోగా శిభిరాలు నిర్వహిస్తున్నందుకు సమాజం ఆరోగ్యానికి పాటుపడుత్నుందుకు భవిష్యత్తులో ఇంకా ఎన్నో యోగా శిభిరాలు నిర్వహిస్తూ ఉన్నత సమాజం కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, నందనం కృపాకర్, పతంజలి యోగ సమతి భారత స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్, పతంజలి యోగ సమితి రాష్ట్ర నాయకులు శివుడు, జి. గోపాలకృష్ణ, రాజారెడ్డి, జిల్లా పతంజలి యోగా భారత్ స్వామి ట్రస్టు అధ్యక్షులు డా. వంగాల రంగాచారి, జిల్లా నాయకులు పెద్ది మనోహర్, శివ శ్రీనివాస్, శనిగరం మల్లయ్య, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ముఖ్య ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణ్, నరేందర్‌రెడ్డి



బెజ్జంకి, అక్టోబర్ 17, మనం న్యూస్: మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, చెలుకల నరేందర్‌రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల సమక్షంలో మండల అధ్యక్షులుగా నియమిస్తూ ముక్కిస రత్నాకర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చెప్యాల శ్రీనివాస్, మైల ప్రభాకర్, చిలివేరు శ్రీనివాస్, కొంకటి రాములు, మాంకాళి ప్రవీణ్, మానాల రవి, దోనె వెంకటేశ్వర్‌రావు, గూడెల్లి శ్రీకాంత్, రొడ్డ మల్లేశం, మెట్ట నాగరాజు, మచ్చ కుమార్, బుర్ర రవి, బాబు, అమరాజు నవీన్, సందీప్‌కుమార్, రాగటి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపిజివిబి ఆధ్వర్యంలో బ్యాంకింగ్ సేవలపై అవగాహన



బెజ్జంకి, అక్టోబర్ 17, మనం న్యూస్: ప్రజలకు బ్యాంకుల ఆధ్వర్యంలో అందిస్తున్న బ్యాంకింగ్ సేవల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఏపిజివిబి బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఏపిజివిబి బెజ్జంకి శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ లావాదేవీలపై ఎన్ అండ్ ఎం కళాకారులతో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలు, బ్యాంకు లావాదేవీలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ , పంట, వ్యాపార రుణ సదుపాయాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ల గురించి వివరించారు. ఈ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ అనిల్‌కుమార్, బ్యాంక్ సిబ్బంది రాజు, వినియోగదార్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటా

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



చేర్యాల, అక్టోబర్ 17, (మనం న్యూస్): ప్రతి కార్యకర్తను కంటికి రెప్ప లా చూసుకుంటానని జనగామ డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొ మ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని కొమ్మూరి నివాసంలో మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సుమారు నాలుగు వందల మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొమ్మూరి సమక్షంలో కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ కంటికి రెప్పలా చూసుకుంటానని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీ పథకాలే పార్టీని అధికారంలోకి తీసుకువస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జెడ్పి ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, మాజీ జెడ్పీటిసి కొమ్ము నర్సింగరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఉడుముల భాస్కర్‌రెడ్డి, మత్స్యశాఖ ఛైర్మన్ ముంజ మల్లేశం, పిఎసిఎస్ ఛైర్మన్ ఉడుముల బాల్‌రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, దాసరి శ్రీకాంత్, మేక మల్లేశం, రాగుల శ్రీనివాస్‌రెడ్డి, దాసరి క్రాంతి కుమార్, జంబుల వెంకట్‌రెడ్డి, కాశెట్టి ఉపేందర్, పెంబర్ల కనకయ్య పాల్గొన్నారు.

## మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టిఎస్‌లోకి ముత్యాల



మిరుదొడ్డి, అక్టోబర్ 17,( మనం న్యూస్): సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజ కవర్గం మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామా నికి చెందిన ముత్యాల భూపాల్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి టి ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణచ బడుతున్న మాదిగలు రాజకీయంగా చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏ,బి,సి,డి వర్గీకరణ కోసం నిరంతరం పోరాడుతున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని మండి పడ్డారు. ఇప్పటికైనా అన్ని రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు ఉద్యమం చేపట్టడం జరుగుతుందన్నారు. తనపై నమ్మకంతో తనను పోరాట సమితిలోకి తీసుకు న్నందుకు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీను, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాజ్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనుకు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు.

## రైతు పక్షపాతి కాంగ్రెస్

- బూటకపు మాటలతో మోసం చేస్తున్న బిఆర్ఎస్, బీజేపి
- ఒక్క అవకాశమిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తా
- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



దుబ్బాక టౌన్, అక్టోబర్ 17, మనం న్యూస్: రైతు సంక్షేమానికి కృషి చేసిన పార్టీ, రైతును రాజును చేయగలిగే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీయే అని, వందకు వందశాతం రైతుపక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దివంగత నేత ముత్యంరెడ్డి ఆశయ సాధన మేరకు శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర 105వ రోజున మంగళవారం దుబ్బాక పట్టణంలోని బిసి కాలనీ, ఎస్సీ కాలనీలో సాగింది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రజా సంక్షేమానికి, రైతు సంక్షేమానికి అమలు చేసిన పథకాలు చేపట్టిన కృషిని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే అమలు చేయబోయే హామీలను ప్రజలకు గడప గడపకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నేడు తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ పాలనలో ఆత్మహత్యలే ఉండవని మాట్లాడిన కేసీఆర్ మాటలు బూటకపు మాటలని, నేటికీ ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని ఇది చాలాబాధాకరమైన విషయమన్నారు. స్వరాష్ట్రంలోనూ రైతుల ఆత్మహత్యలు తగ్గకపోతే ఇక ఎప్పుడు రైతుల బతుకులు మారుతాయన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో రైతుల సంక్షేమానికి చేపట్టిన పథకాల ద్వారా రైతులు మూడు పంటలు పండించుకొని చేతినిండా పంటతో సంతోషంగా ఉండేవారన్నారు. అదేవిధంగా ప్రజా సంక్షేమాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలి ప్రజలకు మాయమాటలు చెప్తూ అటు కేంద్రంలో, ఇటు దుబ్బాకలో ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావులు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్, బీజేపిలు చేస్తున్న బూటకపు హామీలను కాంగ్రెస్ గుర్తించి ప్రజలకు సంక్షేమాన్ని అందించేందుకు గాను ఆరు గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ. 2500లు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసాతో ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, ఉద్యమకారులకు 250 చ.గ. స్థలాన్ని, యువ వికాసంద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, చేయూత ద్వారా వితంతువులు, వికలాంగులకు, బీడి కార్మికులతో పాటు ఇతరులకు నెలకు రూ. 4 వేల పింఛన్, పేదలకు రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీబీమా అందిస్తామన్నారు. కావున ప్రజలంతా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. అంతకుముందు వివిధ గ్రామాల నుండి పలువురు మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు ఏసురెడ్డి, మండల అధ్యక్షులు కొంగరి రవి, జనరల్ సెక్రటర్ మంద శ్రీనివాస్, నాయకులు ఆకుల భరత్, శ్రీకాంత్, బాస మధు, మట్ట కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూత్ అసోసియేషన్ ఎన్నిక



బెజ్జంకి, అక్టోబర్ 17, మనం న్యూస్: ప్రేమే లక్ష్యం సేవే మార్గం అనే నినాదంతో ఏర్పాటు చేసిన పవనపుత్ర యూత్ అసోసియేసన్ గూడెంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఇతర యూత్‌లకు ఆదర్శంగా నిలుస్తుందని నూతన కార్యవర్గ సభ్యులు అన్నారు. మంగళవారం పవనపుత్ర యూత్ అసోసియే షన్ గౌరవ అధ్యక్షులుగా యాలాల పర్శరాములు, అధ్యక్షులుగా దొంతి హరీష్, ఉపాధ్యక్షులుగా భీమ్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, గూడెల్లి సుధాకర్‌లను, ప్రధాన కార్యదర్శిగా యాలాల శివ కుమార్, కోశాధికారిగా సందవేణి శేఖర్, కల్లూరి మహేష్, ఏగోళం అజయ్, దోపాటి చందు, పైడిపల్లి రాజు, బోనాల అనిల్, మహంకాళి, ధనరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బీజేపిలో చేరిన చక్రదారి భైరవట్ల



చేర్యాల, అక్టోబర్ 17,(మనం న్యూస్):గత పదిహేనేళ్లుగా సామాజిక ఉద్యమాలు, ప్రజా సమస్యలు, హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన జాక్ ఛైర్మన్ చక్రధారి మంగళవారం రాష్ట్ర బీజేపి పార్టీ కార్యాలయంలో బీజేపి చీఫ్ కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో బీజేపి తీర్థం పుచ్చుకున్నారు. మోదీ విధానాలకు ఆకర్షితుడై హైదరాబాద్‌లో పూర్వ పరిషద్ విద్యార్థి నాయకులు, హైకోర్టు వకీలు చక్రధారి పార్టీలో చేరినట్లు తెలిపారు. జనగామలో అసెంబ్లీ టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ ఆదేశాల మేరకు అభ్యర్థి గెలుపు కోసం తమ టీమ్ పని చేస్తుందన్నారు. నాన్ లోకల్ పల్లాను ఓడించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వడానికి జనగామ ఓటర్లు ఎదురు చూస్తున్నారని, అలాగే చేర్యాల నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ అభ్యర్థిని జనగామలో ఓడించి బీజేపి జెండా ఎగురవేస్తామన్నారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట, జనగామ ప్రాంతాల నుండి యాభై వాహనాలలో వందల మంది బీజేపిలో చేరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బీజేపి ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్, మహిళా మోర్చ నాయకులు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మిరుదొడ్డి, అక్టోబర్ 17, మనం న్యూస్: మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామ యువకులు సుమారు 50 మంది వివిధ పార్టీల నుండి భారతీయ జనతా పార్టీలో చేరగా దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ బిఆర్ఎస్ అవలంభిస్తున్న అవినీతిపై ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలు దుబ్బాక నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేయడం కోసం కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలన్నారు. బిఆర్ఎస్ పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించకపోవడంతో ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన చూసి బీజేపిలో చేరడానికి యువత ముందుకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇంచార్జ్ డా. రవిందర్, గుర్రప్ప గారి నిఖిల్, అనిల్ యాదవ్‌తోపాటు ఉన్నారు.

# కనపడని.. కమల.. వికాసం..!

- సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న బిజేపి శ్రేణుల హడావుడి ఎక్కడ
- పార్టీ పరిస్థితిని చూసి చతికిల పడుతున్న జిల్లా నాయకత్వం
- ఎందుకో కాషాయనాథులలో కనపడని జోష్
- అభ్యర్థుల ఎంపిక ఆలస్యంతో ఆశవాహుల అయోమయం
- ఇప్పటికే కొందరు నేతలు కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలతో సంప్రదింపులు





సూర్యాపేట, అక్టోబర్ 17, (మనం ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతుంటే కమలదళం మాత్రం ఉలుకుపలుకు లేని విధంగా ఎక్కడవేసిన గొంగళి అన్న చందంగాకనిపిస్తుంది..ఇందుకు కర్ణుడు చావుకు వెయ్యి కారణాలు అన్న చందంగా పార్టీ పరిస్థితి త యారైంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో సూర్యాపేటజిల్లాలోని పార్టీ క్యాడర్ చల్లబడ్డట్టు కనిపిస్తుంది. రెట్టింపు ఉత్సాహంతో ఉన్న ఆ పార్టీ క్యాడర్ ఒక్కసారిగా నైరాశ్యానికి గురి అయింది. బిసిలో బలమైన నాయకుడిగా రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుని పార్టీని కూడా తనదైన శైలీలో అగ్రగామిగా నిలిపిన బండి సంజయ్ అధ్యక్ష బాధ్యతల నుండి వైదొలగడంతో రాష్ట్రంతో పాటు జిల్లాలో కూడా కమలం చరిష్మా మసకబారింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నింటికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులే సగానికి పైగా ఉన్నా దాని అవశ్యకతను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కాషాయదళం విఫలమైందనే విమర్శలు, ఆ పార్టీ నాయకుల నుండే వినపడుతుంది. ఇటివల పలు విషయాలలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున విధానాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయనే ఆపవాదు పార్టీలో సైతం చర్చనీయాంశంగా మరింది. దీంతో రాష్ట్రంలో భాజాపా, బిఆర్ఎస్ ఒక్కతాటి ముక్కలేన నే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడటం గమనార్హం. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గతంలో మాదిరిగా బిఆర్ఎస్పార్టీపె విమర్శలు, ఆరోపణలు చేస్తున్న సామాన్యులు మాత్రం నమ్మడంలేదనే విమర్శ ఆ పార్టీ వర్గాల నుండే వినపడుతుంది.

## పెట్రోల్ వంటగ్యాస్ పెంపుతో ప్రజల్లో వ్యతిరేకత

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నిత్యవసర వస్తువులైన పెట్రోల్, వంట గ్యాస్ ధరలు భారీగా పెంచడంతో సామాన్య ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత మొదలైంది. ముఖ్యంగా వంట గ్యాస్ ధరను మూడింతలు పెంచడంతో మహిళ ఓటర్లు బాజాపాను ఈ ఎన్నికల్లో విశ్వసించని పరిస్థితి ఏర్పడింది. ఏ నియోజకవర్గంలోనైన పురుషులతో సమానంగా మహిళా ఓటర్లు కలిగి ఉండటంతో కమలం పార్టీ పోటీ చేసే సెగ్మెంట్‌లలో మహిళ ఓటర్ల ప్రభావం తప్పకుండా పడుతుందని, రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## జిల్లాలో కనిపించని కాషాయ చరిష్మా

జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాలలో భారతీయ జనతా పార్టీ ప్రస్తుత పరిస్థితుల్లో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తే డిపాజిట్లు కూడా దక్కని పరిస్థితి ఏర్పడటం ఖాయమని రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. నాలుగు నియోజకవర్గాలలో సూర్యాపేట మినహ మిగిలిన తుంగతుర్తి, హుజుర్‌నగర్, కోదాడలలో ఆ పార్టీ అంతంతం మాత్రమే ఉంది. రానున్న సార్వత్రిక ఎన్నికలు ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు ఏలా వ్యవహరించనున్నాయో వేచి చూడాలి మరి.

## ఓంకార్ వర్ధంతి



జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 17, (మనం న్యూస్): ఎంసిపిఐయు వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 15వ వర్ధంతిని మండల కేంద్రంలో తెలంగాణ చౌరస్తాలో ఆపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి నలుగురి రమేష్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం పోరాడిన మహానీయుడని కొనియాడారు.తన తుది శ్వాస వరకు పేద ప్రజల పక్షాన నిలబడ్డాడని అన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి కుందుకూరి మహేష్, ప్రజాపంతా జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, డివిజన్ కార్యదర్శి ఎర్ర అనిల్, నర్సయ్య, సట్టు నర్సయ్య, రాంమ్మూర్తి, వేముల పెద్ద నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా చెక్ పోస్ట్ పరిశీలించిన ఎస్పీ



తిరుమలగిరి, అక్టోబర్ 17, (మనం న్యూస్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధి తిరుమలగిరి పాత గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన సూర్యాపేట-యాదాద్రి జిల్లాల అంతర్ జిల్లాల సరిహద్దు చెక్ పోస్టను సూర్యాపేట ఎస్పీ రాహుల్ హేగ్డే మంగళవారం సందర్శించి వాహనాలు తనిఖీలు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్ పోస్ట్ నందుప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తనిఖీ సందర్భంగా దొరికిన మద్యం డబ్బులను స్వాదీనం చేసుకొని వివరాలను రికార్డులో నమోదు చేయాలని కోరారు. పోలీసు తనిఖీల్లో సాధారణ ప్రయాణికులకు స్థానిక ప్రజలకు అసౌకర్యం కలగకుండా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్ టీమ్ సిబ్బందితో ఇతర అధికారులతో సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఆకస్మిక తనిఖీలు చేస్తు అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. పౌరులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా రక్షణ కల్పించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం, తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల పోలీ మోడల్ అధికారి డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచిసీఐ రాజేష్, ఎకలక్షన్‌సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సీఐలు శివశంకర్, మురారి, ఎస్ఐలు ప్రవీణ్, సైదులు, ప్రసాద్, అంజిరెడ్డి, రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వనమాకు బిఆర్ఎస్ నాయకుల శుభాకాంక్షలు



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17, (మనం ప్రతినిధి): కొత్తగూడెం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కెసిఆర్ చేతుల మీదుగా బిఫాం అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు స్వగృహంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావును గెలిపించుకునేందుకు, తాము అహర్నిశలు కృషి చేస్తామని, వనమా హయాంలో జరిగిన అభివృద్ధి పనులను, ప్రజలకు వివరిస్తూ వనమా గెలుపు యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ప్రజల్లోకి వెళతామని వివరించారు.కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు, మమండల కోఆప్షన్ సభ్యులు జక్కుల సుందర్ రావు, ఉర్దూఘర్ చైర్మన్ అన్వర్ పాషా, ఎంపీటీసీ కొల్లు పద్మ, సర్పంచ్ బలరాం నాయక్, మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఎగ్బాల్ మరియు టిఆర్ఎస్ నాయకులు ఐకి సత్యనారాయణ, బరపటి ప్రసాద్, తూర్పాటి రామారావు, పుట్టి రవితేజ, గంగవరపు సురేష్, మాచర్ల శ్రీనివాస్, పెంచల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పీసువాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారు ?

- బిఎస్పీ కొత్తగూడెం అభ్యర్థి ఎర్రా కామేష్



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 17, (మనం ప్రతినిధి): కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచ మండల పరిధిలోని మల్లారం దాని చుట్టుపక్కల 8 గ్రామాలకు సాగునీరు అందించే పీసువాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తి చేస్తారని బీఎస్పీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ ప్రశ్నించారు? మన కొత్తగూడెం-మన కామేష్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉల్వానూర్, గంగదేవిగుప్ప, కొత్తబంజర, పాతబంజరలో పర్యటించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. గ్రామస్తులతో కలిసి పీ సువాగు ప్రాంతాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ 1989లో రూ.34 లక్షలు మంజూరు చేసి 33 ఏ ళ్ళుగా నలుగురు ఎమ్మెల్యేలు మారినా నేటికి ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.



పీసువాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే మల్లారం, నర్సింహసాగర్, లక్ష్మీదేవిపల్లి, బంజర, గుండ్లమడుగు తదితర గ్రామాల్లోని సుమారు ఐదువేల ఎక రాలకు సాగునీరు అందుతుందని, రైతులు రెండు పంటలు పం డించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.గిరిజనుల పట్ల వై ఖరికి పీసువాగు నిర్మాణమే నిదర్శనమన్నారు. కొత్తగూడెంలో బీఎస్పీ గెలిచిన ఆరు నెలల్లో పీసువాగు ప్రాజెక్టు పనులను పు నరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో మండల, ప ట్టణ అధ్యక్షులు కాటబోయిన వసుంధర, కోళ్ళపూడి ప్రవీణ్ కు మార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండి రమణి,అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు కోలా మల్లికా, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట చెరువు కబ్జా

- కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



పాల్వంచ, అక్టోబర్ 17, (మనం న్యూస్): పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోనే ఎర్రగుంట చెరువును చంద్ర వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కబ్జా చేసి పట్టేదార్ పాస్ పుస్తకాలు పుట్టించి దర్జాగా రైతుబంధు పొందుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పేర్కొన్నారు. పాల్వంచలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ పూర్తి వివరాలు తెలిపారు. వారి కథనం మేరకు... 75 సంవత్సరాల క్రితం సీతారాం సెట్, జమాలపురం గోపాలరావు అనే వ్యక్తులు వారి వ్యవసాయ అవుసరాలు నిమిత్తం 16 ఎకరాల్లో చెరువు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఆ చెరువుక్రింద ఉన్న భూములను సీతారాం సిట్ బంజరు ఎర్రగుంట రైతులు కొనుగోలు చేశారు. 'ఇంటి స్థలాలు కూడా వారివద్దనే కొనుగోలు చేసి ఊరు ఏర్పాటు చేసుకొకున్నారు. ఊరు పేరు కూడా సీతారాం సెట్ కాగా కాలక్రమేణా ఆ చెరువు నీటి రంగు ఆధారం చేసుకొని ఎర్రగుంట అని వ్యవహరిస్తున్నరు. వ్యవసాయంజీవనాధారం చేసుకొన్నారు. ఊరు మొత్తం పాడి రైతులుగా వున్నారు. అన్నిటికీ ఆ చెరువే ఆధారం. అలాంటి చెరువును తెలంగాణ ఉద్యమం పేరు మీదా ఉద్యమకారుడి అవుతారం ఎత్తిన చంద్ర వెంకటేశ్వర్లు అను వ్యక్తి సీతారాం సెట్ మనుమలను అ భూమి వారసులుగా చూపించి అప్పటి రెవిన్యూ అధికారులకు లంచాలిచ్చి ఉద్యమం పెరు మీదా బెదిరించి పట్టేదార్ పాసు పుస్తకాలు పొందాడు. 2015 నుండి ఆ చెరువులో పంట వేయడం ప్రారంభించారు. దానిని గ్రామస్థులు అడ్డుకోగా తాను నక్సలైట్ ను చంపుతాను, మీ ఇంటి స్థలాలు, ఇళ్లు కూడా నా పేరుమీదే ఉన్నాయని బెదిరిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. అక్కడ ఒకరిద్దరు దళితులను అడ్డం పెట్టుకొని ప్రతిదానికి వారిని అడ్డం పెడుతున్నాడు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగ దేశం ప్రభుత్వ హాయంలో రెండుసార్లు పనికి ఆహార పథకం క్రింద చెరువు పూడిక తీపించడం జరిగింది. దానికి సంబందించిన రికార్డులు ఇరిగేషన్ వారి వద్ద ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువు పూడిక తీతకు 20 లక్షలు మంజూరు కాగా అది పట్టాభూమి అని చూపించి, అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేతో వాటిని రద్దు చేపించాడు. దుర్మార్గంగా చెరువు కట్టవరకు పెన్సింగ్ వేసి పశువులను కూడా చెరువులోకి పోకుండా అడ్డుకొన్నాడు. అప్పుడు సిపిఎం ఆధ్వర్యంలో అక్కడి రైతులు పెన్సింగ్ కూలగొట్టారు. చెరువు అలుగును నాశనం చేసి నీరు నిల్వలేకుండా చేసి 150 ఎకరాల పంట ఎండిపోయేటట్లు చేసాడు. వీటన్నిటిపై అనేక సార్లు అక్కడి రైతులు సిపిఎం ఆధ్వర్యంలో ఎమ్మార్వో, కలెక్టర్, ఇరిగేషన్ ఆఫీసుల ముందు ధర్నా చేసే వినతిపత్రాలు అందించారు. పట్టాలు రద్దు చేయమని గత కలెక్టర్ అనుదీప్ చెప్పినప్పటికీ రద్దుకాలేదు. ఇరిగేషన్ అధికారులు ఎఫ్ టి ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) నిర్ధారించి హద్దులు పెడతామని చెప్పి ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. అలుగు నిర్మాణం చేయలేదు. రైతులు నీటి నిల్వ కోసం అలుగును పూడ్చే ప్రయత్నం చేయగా అడ్డుకొని రైతులపై హత్య ప్రయత్నం కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారు. అక్కడి దళిత రైతుల భూములను దొంగ రిజిస్ట్రేషన్లు చేపించుకొన్ని వారి భూములు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నాడు. గడ్డం ప్రసాద్, గడ్డం రమేష్ అనే దళితులు 18 సంవత్సరాల క్రితం కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేసుకొన్న భూములను కూడా కబ్జా చేయడానికి శెట్టి ఏసు అను వ్యక్తి ద్వారా వారిపై దాడులు చేపించి వారిని భూముల్లోకి పోకుండా అడ్డుకొంటున్నాడు. ఇవన్నీ అధికార పార్టీ.. లంచగొండి అధికారుల అండతో చేస్తున్నాడు. తిరిగి నాలుగు రోజుల క్రితం చెరువును దున్నడానికి ప్రయత్నించగా అక్కడి పాడి రైతులు, మహిళలు అడ్డుకోగా వారిపై దుర్భాషలాడి తన బండిని తనే పగులగొట్టుకొని బండిని నాశనం చేశారని ఇద్దరు మహిళలు ఇద్దరు పురుషులపై కేసు పెట్టాడు. వీటన్నింటిపై కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకొని కబ్జాదారుడిపై క్రిమినల్ చర్యలు తీసుకొని అక్రమ పట్టాలు రద్దు చేసి వాటిపై పొందిన రైతు బంధు, రోడ్డు విస్తరణ పనులు ద్వారా భూమి కోల్పోయామని పొందిన డబ్బులు మొత్తం రికవరీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు దొడ్డా రవికుమార్ డిమాండ్ చేశారు.

## టీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి



తిరుమలగిరి, అక్టోబర్ 17, (మనం న్యూస్): తుంగతుర్తి నియోజకవర్గంలో మూడవసారి టీఆర్ఎస్ జండా ఎగరడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కోరారు. మంగళవారం తిరుమలగిరి పట్టణంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి మున్సిపాలిటి తిరుమలగిరి మండలాలుబూత్ ఇంఛార్జిల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసమావేశాన్ని దూషించి ఆయన మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ 100 కుటుంబాలను కలిసి కేసీఆర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని చెప్పారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని సాగు తాగునీరు సమృద్ధిగా లబిస్తుందని వివరించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేందర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. రఘునందన్‌రెడ్డి, కళ్లెట్లపల్లి ఉప్పలయ్య, సోమేష్, తిరుమలగిరి ఎంపీపీ నెమరుగొమ్ముల స్నేహలత, మార్కెట్ ఛైర్మన్ కొమ్మినేని స్రవంతి, ప్రజాప్రతినిదులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బూత్ ఇంఛార్జిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల చూపు కాంగ్రెస్ వైపు

- పదేళ్లలో 400 కి గ్యాస్ ఇవ్వాలని అనిపించలేదా
- ఇంటికో ఉద్యోగం,నిరుద్యోగ భృతి ఏవి
- కేసీఆర్‌కు భద్రాచలం ఎంఎల్‌ఏ పొదెం వీరయ్య ప్రశ్న



భద్రాచలం, అక్టోబర్ 17, (మనం న్యూస్): రాష్ట్ర ప్రజల చూపు కాంగ్రెస్ వైపు ఉందని భద్రాచలం ఎంఎల్ఏ పొదెం వీరయ్య పేర్కొన్నారు. భద్రాచలంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన 100 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం తీసుకువచ్చిన ఆరు హామీలకు ఆకర్షితులై భద్రాచలం శాసన సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో పొదెం వీరయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు బలబద్రి మణికంఠ, మహిళా కాంగ్రెస్ నాయకులు రూపాదేవి,శిల్ప లు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా సుందరయ్య నగర్ కాలనీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు ఇచ్చే ఆరు హామీల గురించి వారికి వివరించారు. దీంతో వారు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పొదెం వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ హామీ కూడా నెరవేర్చలేక పోయిందన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి 3016 లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఏ హామీని కూడా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో చివరి ప్రాంతమైన భద్రాచలానికి తీవ్రమైన అన్యాయంచేశారని, ఆంధ్రాలోకి వెళ్లిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలిపి అభివృద్ధి చేయాలని అసెంబ్లీ సాక్షిగా కోరితే ఆ విషయాన్ని కేసీఆర్ పెడచెవిన పెట్టారని విమర్శించారు. బిఆర్ఎస్ పదేళ్ల ఏలుబడిలో భద్రాచలం ప్రాంతం ఒక పదేళ్లు అభివృద్ధిలో వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. భద్రాచలనికి జరిగిన అన్యాయాన్ని గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్,జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ చింతరేల రవికుమార్,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు బలుసు నాగ సతీష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బంధం శ్రీనివా స్ గౌడ్,ఎన్.ఎస్.యు.ఐ నియోజకవర్గం అధ్యక్షులు సరెళ్ళ వెంకటే ష్,యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు చింతరేల సుధీర్,యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడారి ప్రదీప్,ఎస్సి సెల్ పట్టణ అ.ద్యక్షులు రాస మల్ల రాము,శిలం రామ్మోహన్ రెడ్డి,కుంద వరపు శ్యామ్, రాగం సుధాకర్,మహిళా కాంగ్రెస్ నాయకులు ఎస్కే వసీమ, ఎస్.కె హసీనా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఐకేపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం



జాజిరెడ్డిగూడెం, అక్టోబర్ 17, (మనం న్యూస్): ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ఐకేపీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో తహసిల్దార్ జక్కి శ్రీనివాస్‌లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీజన్‌లో మండలంలో 20 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులు ఆరబెట్టిన శుభ్రం చేసిన ధాన్యాన్ని తీసుకరావాలని కోరారు. రెండు మూడు రోజుల్లో కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో ఏవో శశిదర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, అధ్యక్షురాలు జయమ్మ, సీసీలులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మూడోసారీ బీఆర్ఎస్‌దే అధికారం




- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతం కంటే భిన్నంగా ఫలితాలు
- మా ఫథకాలను కాంగ్రెస్సే కాపీ కొట్టింది
- మీడియా సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో): రాష్ట్రంలో మూడోసారి బిఆర్ఎస్‌దే అధికారమని, కేసీఆర్ హ్యాట్రిక్ సిఎం కాబోతున్నారని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జోస్యం చెప్పారు. ఖమ్మంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ అభ్యర్థులతో కలిసి మంత్రి మాట్లాడారు. గడచిన ఐదేళ్ల ప్రజలు మమ్మల్ని బీఆర్ఎస్ పార్టీలో చూశారు. 2014, 18 ఎన్నికల లాగా కాకుండా ఇప్పుడు అందుకు భిన్నంగా బీఆర్ఎస్ పార్టీ రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తుంది. రాష్ట్రంలో అన్ని సర్వేలు, మేధావులంతా సీఎంగా కేసిఆర్ మూడవసారి విజయం సాధిస్తారని ఇప్పటికే వెల్లడించారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నుండి అత్యధిక సీట్లు గెలిచి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎవరో ప్రజలకు తెలుసు, ప్రత్యర్థి పార్టీలు వారికి అభ్యర్థి ఎవరో తెలుసుకోవడానికి తర్జన భర్జన పడుతున్నాయని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు విభిన్నంగా ఆలోచించాలి. అభివృద్ధి వైపే నిలవాలని కో రారు. ఇతర జిల్లాల కంటే ఎక్కువగా సీఎం కెసిఆర్ ఖమ్మం జిల్లాకు పెద్ద పీట వేశారు. ఖమ్మం జిల్లా ప్రజలంతా ఆలోచన చేయాలి. మా ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనే ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు మొదటి సారి 63, రెండవసారి 84 సీట్లు అందించారు. ఈసారి 80 నుండి 90 వరకు సీట్లను గెలవబోతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ మా కార్యక్రమాలను, హామీలను కాపీ కొట్టింది. పైగా మేము కాపీ కొట్టామని రేవంత్‌రెడ్డి అంటున్నారు. కాంగ్రెస్ పించన్ వందల్లోనే ఇచ్చింది.. దాన్ని వేలు చేసింది సీఎం కేసిఆర్ ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వం మా పథకాలను కాపీ కొట్టింది. కేసిఆర్ కు చిత్తశుద్ధి ఉంది కాబట్టి ఆయన చెప్పిందే చేస్తారు. మనం కూడా మన కుటుంబ సభ్యులకు భీమా చేయించం. కేసిఆర్ బీమా పథకాన్ని పెట్టిన సీఎం కెసిఆర్ కు రాష్ట్ర ప్రజల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. చిన్న రాష్ట్రాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన సీఎం కెసిఆర్‌కు మూడవసారి విజయం అందించే బాధ్యత ఖమ్మం జిల్లా ప్రజలపైనా ఉందని తెలిపారు. తమ అభ్యర్థులు అందరినీ కారు గుర్తుపై ఓట్ వేసి గెలిపించాలని కోరారు.

**పదేళ్లలో ఎంతో అభివృద్ధి : ఎంపీ నామ**

తెలంగాణ సాధించుకున్న తర్వాత గత 10 ఏళ్లలో చాలా అభివృద్ధి జరిగింది.సంక్షేమ పథకాల అమలులో కూడా దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది. కేసిఆర్‌ను మూడవ సారి సీఎంగా ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తారని ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేసిఆర్ కు పేదలు, రైతులు, కరెంట్, నీటి కష్టాల విలువ తెలుసు కాబట్టి గొప్ప గొప్ప పథకాలు రాష్ట్రానికి అందించారన్నారు. సీఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన పథకాలను పలు రాష్ట్రాలు, కేంద్రం కాపీ కొట్టాయన్నారు. ఇప్పటికే దేశంలో కరెంట్ విషయంలో పవర్‌క్యాపిటల్ మనమే ఉన్నామన్నారు. కొన్ని పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవు, ఆ ఆలోచన కూడా ఇతర రాష్ట్రాల సీఎంలకు రావు. గత 10 ఏళ్లలో ఇచ్చిన ప్రతి హామీను మేము చూసి చూపాం, ఇప్పుడు ఇచ్చే హామీలను చేసి చూపుతాం. 60 ఏళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ఇప్పుడు ఆ పార్టీ 6 గ్యారెంటీలు అంటుంది. వీటిని ఎవ్వరూ విశ్వసించరని అన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపి వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్యే రాములు నాయక్, బిఆర్ఎస్ అభ్యర్థులు సండ్ర వెంకట వీరయ్య(సత్తుపల్లి), మధన్ లాల్(వైరా), లింగాల కమల్ రాజ్(మధిర), నాయకులు పగడాల నాగరాజు, ఆర్‌జెసి కృష్ణ, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్ కుమార్ ఉన్నారు.

## ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో): నూతన కలెక్టరేట్ లో నిర్వహించబడుచున్న ఎన్నికల కంట్రోల్ రూమ్ ను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంట్రోల్ రూమ్ కి వచ్చే ఫిర్యాదులు, చేపడుతున్న చర్యలను పరిశీలించారు. కంట్రోల్ రూమ్ లో ప్రదర్శించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి, ఎఫ్ఎస్టి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీముల వివరాలు, సంప్రదించాల్సిన నెంబర్లతో సహా ఉన్న ఫ్లెక్సీలను పరిశీలించారు. సి విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వస్తున్న ఫిర్యాదులు, పరిష్కార వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సి విజిల్ యాప్ ద్వారా 72 ఫిర్యాదులు రాగా, పరిష్కరించినట్లు, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 343 కాల్స్ వచ్చినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారి ద్వారా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 21 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, సిసి కెమెరాలు అమర్చినట్లు, అట్టి సిసి కెమెరాలను కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1950, 9063211298 లకు కాల్ చేసి ఫిర్యాదులు, సందేహాలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సిపిఓ ఏ. శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్, రంజిత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విస్తృతంగా తుమ్మల ప్రచారం



ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో): మాజీ మంత్రి వర్యులు, ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రముఖ విద్యా సంస్థల (నిర్మల్ హృదయ్ స్కూల్) అధిపతి వంగా సాంబశివ రెడ్డిని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద్భంగా సాంబ శివరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తన సంపూర్ణ సహాయ సహకారాలు వుంటాయని చెప్పారు. ఆ తరువాత తుమ్మల నాగేశ్వరరావుకి సంబందించిన నామినేషన్ ఫీజు 10,116 రూపాయలు సాంబశివరెడ్డి సతీమణి చేతులు మీదుగా అందించి ఆశీర్వదించారు. అనంతరం ప్రముఖ పిల్లల వైద్యులు కూరపాటి ప్రదీప్‌ను కలిసి చర్చలు జరిపారు.

**కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో పూజలు**

ఖమ్మం నగరంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న దేవిశ రన్న వరాత్రులు ఉత్సవాల్లో తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ ప్రము ఖులను కలిశారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



ఏన్కూరు, అక్టోబర్ 17(మనం న్యూస్): మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోనున్న పోలింగ్ కేంద్రాలను వైరా నియోజకవర్గ ఎన్నికల అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. మంగళవారం మండలంలో రూట్ నెంబర్ 9లో గల నూకలంపాడు, గార్లఒడ్డు, మేడేపల్లి, నాచారం, ఒంటిగుడిసె గ్రా మాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం పరిసరాలను ఆయన పరిశీలించారు. త్రాగునీరు, వి ద్యుత్తు, మరుగుదొడ్లు వంటి వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికా రులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సిహెచ్ .శేషగిరి రావు, ఎండిఓ తుమ్మలపల్లి కృష్ణ, ఏవో ఏ.నరసింహారావు, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆర్జేసి కృష్ణ



ఖమ్మం, అక్టోబర్ 17(మనం న్యూస్): దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలో ని బుర్హాన్‌పురం ప్రాంతంలో గల మేకల సంఘయ్య వీధిలో మండపం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన అన్న దానం కార్యక్రమాన్ని బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్.బి. ఐ.టి., ఆర్జేసి విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత ఆయన స్థానిక పెద్దలు, మండపం నిర్వాహకులతో కలిసి అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి అందరి పై ఉండేలా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్‌లో కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో మేకల రామయ్య, మేకల భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- అభ్యర్థుల ఖర్చును పరిశీలించాలి
- అకౌంటింగ్ బృందాలకు కలెక్టర్ విపి గౌతమ్ ఆదేశం



ఖమ్మం, అక్టోబర్ 17(మనం బ్యూరో) : శాసనసభ సాధారణ ఎన్నికలలో ప్రతి అభ్యర్థి ఎన్నికల వివరాలను భారత ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, శాసనసభ సాధారణ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల నమోదుపై అకౌంటింగ్ బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, రానున్న శాసనసభ సాధారణ ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎన్ని కల ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా నమోదు చేయాలని, పారదర్శకంగా ప్రతి అభ్యర్థికి సమాన హక్కులు కల్పిస్తూ ఎన్ని కలను నిర్వహించాలని అన్నారు. భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గానికి అభ్యర్థి ఎన్నికల ఖర్చును గరిష్ట పరిమితి రూ. 40 లక్షలుగా నిర్ధారించిందని కలెక్టర్ తెలిపారు. రాబోయే రోజులలో జిల్లాలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలు సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాలు పంపిణీ, ప్రచార ప్రకటనలు, వీఐపీలు పాల్గొనే బహిరంగ సభలు వాటికి అయ్యే వివరాలను నిషితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఖర్చుకు ఆధారాలు నిర్వహించాలన్నారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఎన్నికల కోసం చేసే ఖర్చులకు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాల్సి ఉంటుందని, అందులో నుంచి మాత్రమే ఎన్నికల ఖర్చులు చేయాలని, వీటిని పరిశీలించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియో సర్వేలెన్సు బృందాలు వీడియో వీవింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు, మానిటరింగ్ సెల్ కాల్ సెంటర్, స్టాటిటిక్ సర్వేలైన్స్ బృందాలు, వ్యయ మానిటరింగ్ సెల్ మొదలకు బృందాలు వారికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని కాల్ సూచించారు. జిల్లాలో ఇక పై ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల కరపత్రాలు ఫ్లెక్సీలు బ్యానర్లు ముద్రించే సమయంలో తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఎన్నికల ఫ్లెక్సీల పై ఎవరు ముద్రిస్తున్నారో వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ప్రింట్ చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో డబ్బు మద్యం ప్రభావం ఉండకుండా నిరంతరం నిఘా ఉండాలని, అభ్యర్థులు ఎన్నికల ఖర్చుపై అధికారులు డేగ కన్నుతో పరిశీలించాలని అన్నారు. ప్రజా ప్రాతినిధ్య 1951 ప్రకారం ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యయ పరిశీలన, స్వీప్ నోడల్ అధికారులు బృందాలకు తమ విధులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా సహకార అధికారిణి విజయకుమారి, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, ఏఇఓలు, ఆడిట్ అధికారులు, అకౌంట్, విఎస్టి, వివిటి బృంద సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలంతా బంధిపోట్లే

- పార్టీ మార్పులపై పువ్వాడ కు మాట్లాడే అర్హత లేదు
- మీ పరిపాలన నచ్చకే ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు
- జిల్లాలో మీ ఓటమి ఖాయం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ ఫైర్

ఖమ్మం, అక్టోబర్ 17 (మనం బ్యూరో) : అసలైన బంధి పోటు దొంగలు బిఆర్ఎస్ పార్టీ నాయకులే అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత రెండు మూడు రోజుల నుండి మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బంది పోటు దొంగల్లా వచ్చి పార్టీ మార్పులు చేపిస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక అర్హత బిఆర్ఎస్ పార్టీకి పువ్వాడ అజయ్ కుమార్ కు లేదని హితవు పలికారు. అధికార పార్టీలో ఉండి కూడా ప్రతిపక్ష పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారంటే రాష్ట్రంలో ఉన్న రాచరిక పాలన కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందని తెలిపారు. పార్టీ మార్పులపై మీరు చేస్తే సంసారం మేము చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. పార్టీ మారేవాళ్ళకి కాంగ్రెస్ పార్టీ ఏ ఆశ చూపడం లేదని కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకుని పార్టీలోకి వస్తున్నారని అన్నారు. పువ్వాడ అజయ్ కుమార్ మమతా రోడ్డులో రెండు డివైడర్లు నాలుగు బల్బులు పెట్టి అభివృద్ధి చేశామని జబ్బలు చరుచుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. ఖమ్మం అభివృద్ధి వాన వస్తే వల వల గాలి వస్తే గలగల అన్నట్టు ఉందని హితవు పలికారు. పువ్వాడ అజయ్ కుమార్ ఇకనైనా కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు మాని జిల్లాకు నువ్వేం చేసావో చెప్పాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ఆరుగారెంటీ లపై బీఆర్ఎస్ అధిష్టానం అవాకులు చవాకులు పేలుతుందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టి ప్రచారం చేయడం బీఆర్ఎస్ కు ఆనవాయితీ అయిందని అన్నారు. కాంగ్రెస్ ను విమర్శించే ముందు కేటీఆర్, కవిత, హరీష్ రావు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని తెలిపారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ... టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి చేరికలు భారీగా పెరిగాయని రానున్న 20 రోజుల్లో ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్పొరేటర్లతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రమాణాలు చేపిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని అయినా కూడా కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరుగారెంటీలతో టిఆర్ఎస్ కాకావికలం అవుతుం దని తెలిపారు.రైతు భరోసా, మహాలక్ష్మి, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు,ప్రతి పంటకు మద్దతు ధర, యువత కోసం విద్యా భరోసా, 2లక్షల ఉద్యోగాల భర్తీ, చేయూత పతకం, మహిళలకు ఉచిత ప్రయాణం హామీలతో కాంగ్రెస్ పై ప్రజలకు ఆదరణ పెరిగిందని ఖచ్చితంగా తెలంగాణలో ఎర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో మంత్రి దీన్ని చూసి తట్టుకోలేక ఆగమాగం అవుతున్నాడని ఎద్దేవా చేశారు.

టిఆర్ఎస్ నాయకులు ప్రజల దగ్గరకు వెళ్లి ఓట్లు అడగటానికి భయపడుతున్నారని, కులానికి ఒక బంధు పేరుతో ప్రజలను మోసం చేశారని అన్నారు. జిల్లాలో ఎంతమంది బిసి జనాభా వుంది, ఎంత మందికి బిసి రుణాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక నైనా పిచ్చి ప్రేలాపనలు మాని తాను చేసింది ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. నగర కార్పొరేటర్ కమర్తపు మురళి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని ఎంతోమంది ప్రజా నాయ కులను తయారుచేసిన పార్టీ కాంగ్రెస్ దేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రాచరిక వ్యవస్థ కొనసాగుతుందని ఒక కుటుం బం చేతులో తెలంగాణ బందీగా ఉందని స్పష్టం చేశారు. ఈ రాచరిక వ్యవస్థను అంతమొం దించాలంటే కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతుందని తెలిపారు. పువ్వాడ అజయ్ పువ్వాడ బ్రాండ్ మీద గెలవలేదని చేతి గుర్తు బ్రాండ్ మీద గెలిచి విర్రవీగుతున్నాడని విమర్శించారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ... జిల్లాలో పువ్వాడ అజయ్ కు మించిన గజదొంగ ఇంక ఎవరూ లేరని, ప్రభుత్వ యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకొని ఆయన చేయని అక్రమాలు లేవని ఆరోపించారు. జిల్లా నుండి పువ్వాడ అజయ్‌ను, తెలంగాణ రాష్ట్రం నుండి బీఆర్ఎస్‌ను తరిమి కొడతామని ప్రతిజ్ఞ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఖమ్మం నియోజకవర్గ పిసిసి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఎస్సి సెల్ అద్యక్షులు బొడ్డు బొందయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా మైనారిటీ అద్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఫీదా బేగం తదితర నాయకులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎన్నికైన యువకునికి సన్మానం

- నరేడ్ల ప్రశాంతను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య



ఆళ్లపల్లి, అక్టోబర్ 17 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఉద్యోగలలో మండల కేంద్రానికి చెందిన నారెడ్ల ప్రశాంత్ ఎంపిక కాగ అతనిని మంగళవారం సిపిఐ పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రశాంత్ తల్లిదండ్రులు నరేడ్ల శ్రీను-విజయ దంపతులకు బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రేస్ ఎల్లయ్య మాట్లాడుతూ మండలంలోని యువత ప్రశాంత్‌ని ఆదర్శంగా తీసుకుని ముందు రోజులలో ఉద్యోగాలు సంపాదించి మండలానికి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నరేడ్ల రాంబాబు, వార్డు సభ్యులు రేసు సురేందర్, బోడకుంట బిక్ష, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ యూనిస్, మండల నాయకులు గుంతోజు శివ, శ్రీరామ సమ్మయ్య, నరేంద్ర కృష్ణయ్య బురుగడ్డ వెంకన్న, నరెడ్ల శ్రీను, కాంగ్రెస్ నాయకులు సిరి నోముల శ్రీనివాస్, సత్యమోజు మధు,నిట్ట ఆబి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ పొదెం వీరయ్యను కలిసిన వనమా గాంధీ




అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 17 (మనం న్యూస్) : భద్రాచలం శాసనసభ్యులు పోదెం వీరయ్యని అన్నపురెడ్డిపల్లి మండల అధ్యక్షులు వనమా గాంధీ మంగళవారం భద్రాచలంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రెండోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా ఆయనను కలిపి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకరరావు, మండల సీనియర్ నాయకులు. పర్సా మాధవ రావు, ఇనుపనూరి జమలయ్య, కల్లోజీ నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్పీ మండల అధ్యక్షుడుగా పాయం సింగరాజు



బూర్గంపహాడ్, అక్టోబర్ 17 (మనం న్యూస్): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, సీఎం అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంపై నమ్మకంతో బహుజన రాజ్య స్థాపనలో నేను భాగస్వామిని కావాలని దృఢ సంకల్పంతో ఆర్ఎస్పీ ఆధ్వర్యంలో పాయం సింగరాజు బిఎస్పీ పార్టీ లో చేరారు. అనంతరం జరిగిన సమావేశంలో బూర్గంపహాడ్ మండల అధ్యక్షునిగా పాయం సింగరాజుని ఏకగ్రీవంగ ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాయం సింగరాజు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని బీఎస్పీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలియజేశారు. నేటి నుండి బూర్గంపహాడ్ మండలంలో బీఎస్పీ పార్టీ నిర్మాణం ప్రచారం పోరాటంలో కీలక భూమిక పోషిస్తానని హామీ ఇచ్చారు .పినపాక నియోజకవర్గంలో బీఎస్పీ గెలుపు కొరకై బూర్గంపహాడ్ మండలంలో విశేష కృషి చేస్తానని తన ఆకాంక్షను తెలియ జేశారు. ఈ సందర్భంగా అవకాశం ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కేవి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిద దామోదర్ సహచర జిల్లా నియోజక వర్గ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## నత్తనడకగా సాగుతున్న నెదర్లాండ్స్ బ్యాటింగ్..

- ముప్పేట దాడి చేస్తున్న సఫారీలు



వన్డే వరల్ కప్లో మూడో విజయం కోసం తహతహలాడుతున్న సఫారీలు పసికూన నెదర్లాండ్స్‌పై ముప్పేట దాడికి దిగుతున్నారు. ధర్మశాల వేదికగా సౌతాఫ్రికా – నెదర్లాండ్స్ మధ్య జరుగుతున్న 15వ లీగ్ మ్యాచ్లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న డచ్ జట్టు.. 21 ఓవర్లు ముగిసేసరికి 5 ప్రధాన వికెట్లు కోల్పోయి 82 పరుగులు మాత్రమే చేసింది. వర్షం కారణంగా రెండు గంటలు ఆలస్యంగా ఆరం భమైన ఈ మ్యాచ్ను 43 ఓవర్లకు కుదించిన విషయం తెలిసిందే. వర్షం తర్వాత ఆట ఆరంభమవగా.. డచ్ ఓపెనర్లు విక్రమ్ జిత్ సింగ్ (2), మ్యాక్స్ ఓడౌడ్ (18)లు వెంటవెంటనే వెనుదిరిగారు. లుంగి ఎంగిడి వేసిన మూడో ఓవర్లోనే రెండు బౌండరీలు కొట్టిన ఓడౌడ్.. అతడే వేసిన ఐదో ఓవర్లో ఐదో బంతినీ థర్డ్ మెన్ దిశగా బౌండరీ తరలించాడు. ఆరు ఓవర్లకు 22 పరుగులు జోడించిన ఈ జోడీని రబాడా విడదీశాడు. అతడు వేసిన ఏడో ఓవర్లో తొలి బంతికే విక్రమ్జిత్ క్లాసెన్కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మరుసటి ఓవర్లోనే మార్కో జాన్సెన్.. ఓడౌడ్ను ఔట్ చేశాడు. తొలి పది ఓవర్లకు 32 పరుగులు మాత్రమే చేసిన డచ్.. ఆ తర్వాత కూడా తడబడింది. రబాడా వేసిన 11వ ఓవర్లో.. బాస్ డీ లీడె (2) వికెట్ల ముందు దొరికిపోయాడు. కోయెట్జ్ వేసిన 16వ ఓవర్లో తొలి బంతికే అకర్మన్ (13) కూడా బౌల్ అయ్యాడు. ఎంగిడి వేసిన 21వ ఓవర్లో రెండో బంతికి సిబ్రండ్ (19) కూడా పెవిలియన్ చేరాడు. 43 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్లో డచ్ జట్టు మిగిలిన సగం ఓవర్లలో ఏ మేరకు నిలబడుతుందో చూడాలి.

## బాబర్! నీకది చేతకాదు.. కెప్టెన్సీ వదిలేయ్..

భారత్‌తో జరిగిన వరల్ కప్ మ్యాచ్‌లో దారుణంగా ఓడిన పాకిస్తాన్ జట్టుపై మాజీ క్రికెటర్లు విరుచుకుపడుతున్నారు. ముఖ్యంగా బాబర్‌ను చేతకాని కెప్టెన్ అని, వెంటనే కెప్టెన్సీ వదిలేయాలని షాకింగ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ లిస్ట్ లో పాక్ మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్ కూడా చేరాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాలిక్.. 'నేను ఎప్పుడో బాబర్ గురించి చెప్పాను. అతడు ఆటగాడిగా జట్టుకు అద్భుతమైన విజయాలు అందించ గలడు. కానీ కెప్టెన్ గా అతడు పనికిరాడు. బాబర్ కి ఔట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించడం ఏ మాత్రం చేతకాదన్నా'డు. బాబర్ ఏదో కెప్టెన్సీ చేస్తున్నాం అంటే చేస్తున్నాం అన్నట్లు ఉంటాడని, అలా అయితే జట్టు ముందుకెళ్ళేది, అభివృద్ధి సాధించేదెలా..? అని ప్రశ్నించాడు.

# కెప్టెన్‌గా రోహిత్ సక్సెస్ సీక్రెట్ అదే..

- అసలు విషయం చెప్పిన మాజీ టీంమేట్!



టీమిండియా కెప్టెన్‌గా రోహిత్ శర్మ సూపర్ సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. అయితే రోహిత్ సక్సెస్ వెనకున్న సీక్రెట్ ని ముంబై మాజీ క్రికెటర్ అమోల్ ముజుందార్ బయటపెట్టాడు. రోహిత్ ని తాను చాలా కాలంగా గమనిస్తున్నానని, ఒకవైపు ఆటగాడిగా, మరోవైపు కెప్టెన్‌గా రోహిత్ సూపర్ సక్సెస్ కావడానికి అతడు ఫాలో అయ్యే కొన్ని విధానాలే కారణమని అమోల్ చెప్పుకొచ్చాడు. పాకిస్తాన్ తో మ్యాచ్‌లో భారత్ సూపర్ విక్టరీ సాధించిన తర్వాత రోహిత్ కెప్టెన్సీని మాజీలు, విశ్లేషకులు తెగ మెచ్చుకుంటున్నారు. తాజాగా అమోల్ కూడా రోహిత్‌ను ఆకాశానికెత్తేశాడు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను రోహిత్ ను చాలా కాలంగా ఎంతో దగ్గరి నుంచి చూస్తున్నానని, రోహిత్ తనను తాను ఎలా మలచుకుంది, స్టార్‌గా ఎలా ఎదిగింది తాను దగ్గరగా చూశానన్నాడు.

'రోహిత్ శర్మ ప్రతి చిన్న విషయాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తాడు. అతి చిన్న విషయాలను కూడా జాగ్రత్తగా గుర్తు పెట్టుకుంటాడు. ముఖ్యంగా మ్యాచ్ స్టాటిస్టిక్స్‌కి చాలా ఇంపార్టెన్స్ ఇస్తాడు. మైదానంలో ప్రత్యర్థి ఆటగాళ్ళ ప్రతి కదలికను క్షుణ్ణంగా పరిశీలిస్తాడు. దాంతో వాళ్ళ వీక్ పాయింట్ ఏంటి? వాళ్ళని ఎలా దెబ్బ కొట్టాలి? వాళ్లపై గెలవాలంటే ఏం చేయాలి? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ స్పష్టంగా సమాధానాలు వెతుక్కోగలడు. అందుకే అతడు బెస్ట్ ప్లేయర్ తో పాటు సూపర్ కెప్టెన్ కూడా కాగలిగాడు' అంటూ ముజుందార్ వివరించాడు. అంతేకాకుండా రోహిత్ ఏ విషయాన్ని కాంప్లికేట్ చేసుకోడని, క్లిష్టమైన సమస్యలను కూడా సింపుల్‌గా పరిష్కరించడానికి ట్రై చేస్తాడని చెప్పిన ముజుందార్.. జట్టు సభ్యులు కూడా తనలాగే ఆలోచించేలా, వాళ్లపై ఒత్తిడి లేకుండా చేయడంలో రోహిత్ స్పెషలిస్ట్ అని, అదే అతడి సక్సెస్ సీక్రెట్ అని చెప్పుకొచ్చాడు. ఇదిలా ఉంటే వరల్ కప్‌లో టీమిండియా వరుస విజయాలతో దూసుకుపోతోంది. మొదట ఆస్ట్రేలియాను చిత్తు చేసిన టీమిండియా, ఆ తర్వాత ఆఫ్ఘన్‌ను అలవోకగా ఓడించింది. ఇక చివరగా పాకిస్తాన్‌ను మట్టికరిపించి అద్భుత విజయం దక్కించుకుంది. ఇక బ్యాటింగ్‌లో కూడా రోహిత్ అదరగొడుతున్నాడు. ఆఫ్ఘన్‌పై సెంచరీ, పాకిస్తాన్‌పై 85 పరుగులు బాది ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు.

# వరల్డ్ కప్‌లో ఇలా అంపైరింగ్ చేస్తారా?..



భారత్ వేదికగా జరుగుతున్న వన్డే వరల్ కప్లో కూడా అంపైరింగ్ పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికే అంపైర్లు ఇచ్చిన కొన్ని నిర్ణయాలు వివాదాస్పదం అయ్యాయి. భారత్, పాకిస్తాన్ వంటి మ్యాచుల్లో అంపైర్లు ఇచ్చిన నిర్ణయాలు కూడా ఆటగాళ్లతోపాటు ప్రేక్షకులకు సైతం గట్టి షాకిచ్చాయి. సీనియర్ అంపైర్లు మరాస్ ఎరాస్మస్ వంటి వారు కూడా తప్పుడు నిర్ణయాలు ఇవ్వడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఇలా అంపైర్లు తప్పుడు నిర్ణయాలు ఇవ్వడంపై పాక్ మాజీ క్రికెటర్ సల్మాన్ బట్ మండిపడ్డాడు. వరల్ కప్ వంటి మెగాటోర్నీలో ఇలాంటి చెత్త నిర్ణయాలు ఇవ్వడం సబబు కాదన్నాడు. దీని వల్ల టోర్నీ స్థాయి తగ్గుతుందని తెలిపాడు. 'ఈ వరల్ కప్లో అంపైరింగ్ ఉండాల్సిన స్థాయిలో లేదు. పరమ చెత్త నిర్ణయాలు తీసుకున్నారు' అని ముక్కుసూటిగా విమర్శలు చేశాడు. 'డేవిడ్ వార్నర్, జానీ బెయిర్‌స్టో వంటి వారి విషయంలో కూడా పొరపాటు నిర్ణయాలు కనిపించాయి. ఇక భారత్, పాక్ మ్యాచులో మహమ్మద్ రిజ్వాన్ను కూడా అవుటిచ్చేశారు. అదృష్టం బాగుండి అతను రివ్యూ తీసుకున్నాడు. దాంతో అంపైర్ నిర్ణయం వెనక్కు తీసుకోవాల్సి వచ్చింది. అదే మ్యాచులో బాబర్ ఆజమ్ను కూడా అవుటిచ్చేవాళ్లు. కానీ బతికిపోయాడు' అని బట్ చెప్పుకొచ్చాడు. ఈ టోర్నీలో అంపైరింగ్ అంతర్జాతీయ స్థాయిలో ఏమాత్రం కనిపించడం లేదని బట్ విమర్శించాడు. కాగా, శ్రీలంకతో మ్యాచులో వార్నర్ అవుటైనప్పుడు చాలా డిసప్పాయింట్ అయినట్లు కనిపించాడు. అతన్ని ఎల్బీడబ్ల్యూ అవుట్గా అంపైర్ ప్రకటించాడు. అయితే బంతి వికెట్లను మిస్ అవుతున్నట్లు కనిపించింది. కానీ రివ్యూలో చూస్తే అది అంపైర్ కాల్ అని చూపించింది. దీంతో వార్నర్ చాలా నిరాశగా మైదానం వీడాల్సి వచ్చింది. ఈ విషయంలో ఫ్యాన్స్ కూడా అంత సంతోషంగా లేరు. కేవలం భారత్ ఆడుతున్న మ్యాచ్ అనే కాదు, ఏ మ్యాచులో అయినా అంపైరింగ్ సరిగా లేకపోతే ప్రేక్షకులు మండిపడటం అందరికీ తెలిసిందే. ఇప్పుడు వరల్ కప్లో అంపైర్లపై కూడా అభిమానులు ఇలాగే ఫైర్ అవుతున్నారు. మరి ఇప్పటికైనా అంపైర్లు కొంచెం జాగ్రత్తగా తమ పని చేస్తారేమో చూడాలి.

## ఆస్ట్రేలియాతో పోరుకు ముందే పాక్ జట్టుకు భారీ షాక్..



భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్లో వరుసగా రెండు మ్యాచ్లను గెలుచుకుని మూడు రోజుల క్రితమే భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్తాన్ జట్టుకు కీలక మ్యాచ్కు ముందు భారీ షాక్ తప్పేలా లేదు. ఈనెల 20న పాకిస్తాన్.. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఆసీస్తో తలపడనుంది. ఈ మ్యాచ్కు ముందే పాకిస్తాన్ కీలక ఆటగాళ్లు వైరల్ ఫీవర్తో బాధపడుతున్నట్టు సమాచారం. భారత్తో అహ్మదాబాద్ వేదికగా ముగిసిన మ్యాచ్ ఓడిన తర్వాత బెంగళూరుకు చేరుకున్న బాబర్ ఆజమ్ సారథ్యంలోని పాక్ టీమ్లో ప్రధాన పేసర్ అయిన షహీన్ షా అఫ్రిది, అబ్దుల్లా షఫీక్, జమాన్ ఖాన్, ఉసామా మీర్లు వైరల్ ఫీవర్తో బాధపడుతున్నట్టు తెలుస్తున్నది. మంగళవారం ఉదయం ప్రాక్టీస్ సెషన్లో ప్రధాన ఆటగాళ్లు హాజరు కాలేదు. సాయంత్రం ఆప్షనల్ సెషన్లో కూడా పలువురు డుమ్మాకొట్టారు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్లో అరంగేట్రం చేసిన అబ్దుల్లా షఫీక్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. కానీ భారత్ తో మ్యాచ్లో షఫీక్ తేలిపోయాడు. ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత అతడు వైరల్ ఫీవర్ బారిన పడ్డాడు. షహీన్ షా అఫ్రిది ఈరోజు ఉదయమే కోలుకున్నాడు. అయితే శుక్రవారం నాటికి వీళ్లంతా కోలుకుని పూర్తి ఫిట్నెస్ సాధిస్తారని పాకిస్తాన్ టీమ్ మేనేజ్మెంట్ భావిస్తున్నది. ఇక వన్డే ప్రపంచకప్లో ఆడిన తొలి రెండు మ్యాచ్లలోనూ ఓడిన ఆస్ట్రేలియా.. సోమవారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్లో ఘనవిజయాన్ని అందుకుని ఫామ్‌లోకి వచ్చింది.

## ఆట ఆరంభం.. వర్షం అంతరాయంతో తగ్గిన ఓవర్లు

వన్డే ప్రపంచకప్‌లో భాగంగా సౌతాఫ్రికా – నెదర్లాండ్స్ మధ్య ధర్మశాల వేదికగా జరుగుతున్న మ్యాచ్ వర్షం అంతరాయం కారణంగా రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా.. తొలుత ఫీల్డింగ్ ఎంపిక చేసుకున్న విషయం తెలిసిందే. నెదర్లాండ్స్ బ్యాటింగ్ చేస్తున్నది. టాస్ తర్వాత వర్షం కురవడంతో ఆటకు అంతరాయం కలిగింది. సుమారు గంటపాటు కురిసిన వర్షం ఎట్టకేలకు తెరిపినివ్వడంతో అంపైర్లు ఈ మ్యాచ్లో ఓవర్లను తగ్గించారు. తాజా నిబంధనల ప్రకారం.. సౌతాఫ్రికా– నెదర్లాండ్స్ మ్యాచ్ను నిర్వాహకులు 43 ఓవర్లకు కుదించారు. సుమారు రెండు గంటల తర్వాత ఆట ఆరంభమవడంతో పవర్ ప్లే నిబంధనలు కూడా మారాయి. తొలి పవర్ ప్లే 1–9 ఓవర్లు కాగా రెండో పవర్ ప్లే 36–43 ఓవర్ల మధ్య ఉండనుంది. సాధారణంగా ఒక బౌలర్ గరిష్టంగా పది ఓవర్లు వేసేందుకు అనుమతి ఉండగా మారిన నిబంధనల ప్రకారం.. ముగ్గురు బౌలర్లు తొమ్మిది ఓవర్లు వేయనుండగా ఇద్దరు బౌలర్లు ఎనిమిది ఓవర్లు వేయాల్సి ఉంది.

# నేషనల్ అవార్డు అందుకున్న అల్లు అర్జున్..



69వ నేషనల్ అవార్డుల వేడుక న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఇన్నాళ్లు అందని ద్రాక్షలాగా మారిపోయిన బెస్ట్ యాక్టర్ అవార్డును అల్లు అర్జున్ అందుకున్నాడు. దశాబ్దాల చరిత్ర కలిగిన తెలుగు సినిమాలో ఇప్పటివరకు మహామహులే సాధించలేని అరుదైన ఘనతను అల్లు అర్జున్ సాధించి సంచలనం సృష్టించాడు. ఇక అల్లు అర్జున్ అవార్డు తీసుకుంటున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తుంది. ఈ అవార్డు ఫంక్షన్లో ముందుగా నిర్మాత నవీన్ ఎర్నేని, దర్శకుడు బుచ్చిబాబు సనాలు ఉప్పెన సినిమాకు గానూ జాతీయ అవార్డులు అందుకున్నారు. అనంతరం బెస్ట్ యాక్షన్ డైరెక్టర్గా కింగ్ సోలోమాన్ ఆర్ఆర్ఆర్ సినిమాకు అవార్డును అందుకున్నాడు. ఆ తర్వాత ఉత్తమ కొరియోగ్రాఫర్గా నాటు నాటు పాటకు ప్రేమ్ రక్షిత్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా ఎమ్.ఎమ్. కీరవాణి(ఆర్ఆర్ఆర్), ఉత్తమ సింగర్గా కాల భైరవ(ఆర్ఆర్ఆర్), ఉత్తమ గేయ రచయితగా చంద్రబోస్ (కొండపొలం), ఉత్తమ వీఎఫ్ఎక్స్కు గానూ శ్రీనివాస్ మోహన్(ఆర్ఆర్ఆర్) అవార్డులు అందుకున్నారు. అన్ని వర్గాలను అలరించిన వినోదాత్మక చిత్రంగా ఆర్ఆర్ఆర్కు గానూ రాజమౌళి 69వ నేషనల్ అవార్డును అందుకున్నాడు. ఇక ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవి శ్రీ ప్రసాద్ పుష్ప సినిమాకు గానూ అవార్డును అందుకున్నాడు.

మనం సినిమా
manamcinema

# నేషనల్ అవార్డ్స్.. పెళ్లి చీరలో మెరిసిన అలియా



నేషనల్ ఫిలిం అవార్డ్స్ 2023 కార్యక్రమం దేశరాజధాని ఢిల్లీలో అట్టహాసంగా జరిగింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరుగుతున్న ఈ వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విజేతలు అవార్డులను అందుకున్నారు. ఈ వేడుకకు టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరో, హీరోయిన్లు హాజరై సందడి చేశారు. టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో పాటు బాలీవుడ్ స్టార్ నటులు అలియా భట్, రణ్‌బీర్ కపూర్, కృతి సనన్, ఆర్ మాధవన్, కరణ్ జోహార్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. 'గంగూబాయి కతియావాడి' చిత్రానికి గానూ ఉత్తమ నటిగా అలియా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ ఉత్తమ నటి పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంది. ఈ కార్యక్రమంలో అలియా భట్ ప్రత్యేక కార్షణగా నిలిచింది. చీరకట్టులో మెరిసిపోయింది. తన పెళ్లి నాటి చీరను ధరించి భర్త రణ్‌బీర్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# పాన్ ఇండియా భామకి ఇది ఊహించనది!




'కేజీఎఫ్' అనే డెబ్యూతోనే పాన్ ఇండియాలో సంచలనమైంది కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టి. తొలి సినిమాతో ఇలాంటి గుర్తింపు రావడం అన్నది చిన్న విషయం కాదు. ఆ విషయంలో శ్రీనిధి లక్కీ గాళ్ అనే అనాలి. పాన్ ఇండియా ఇమేజ్ కోసం ఎంతో మంది భామలు ఎదురుచూస్తున్నా! ఎవరికీ రాని అదృష్టం శ్రీనిధికి వచ్చింది. కానీ ఏం లాభం కెరీర్ పరంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. తన కెరీర్ తాను అనుకున్న దానికి రివర్స్ లో జరుగుతున్నట్లే కనిపిస్తుంది. 'కేజీఎఫ్' హిట్ తర్వాత విక్రమ్ తో 'కోబ్రా' సినిమా చేసింది. అది ఫ్లాప్ అయింది. కానీ ఆ ఫ్లాప్ అమ్మడి ఇమేజ్ పై పెద్దగా ప్రభావం చూపేదేం కాదు. అదీ కేజీఎఫ్ హిట్ తర్వాత నాలుగేళ్ల గ్యాప్ తర్వాత చేసిన సినిమా అది. పాన్ ఇండియాలో గుర్తింపు రావడంతో అన్ని భాషల్లో అవకాశాలు వస్తాయి బిజీ అవ్వొచ్చని అమ్మడు నాలుగేళ్లు ఖాళీగానే గడిపేసింది. మరి వచ్చిన అవకాశాలు కాదనుకుందా? లేక అవకాశాలే రాక ఖాళీగా ఉందా? అన్నది తెలియదు. తాజాగా అమ్మడు తెలుగులో సిద్దు జొన్నల గడ్డ సరసన ఓ సినిమాకి సైన్ చేసింది. పాన్ ఇండియాలో ఐడెంటిటీ ఉన్న హీరోయిన్ ఒక్కసారిగా ఇలా చిన్న సినిమాకి సైన్ చేయడం అమె అభిమానులు జీర్ణించుకోలేనిదే అయినా..అవకాశం ఇవ్వడం అన్నది గొప్ప విషయమే. అమ్మడికి ఏ పరిశ్రమ అవకాశాలు ఇవ్వని సమయంలో టాలీవుడ్ ఈ చిన్న సినిమాలో అవకాశం కల్పించింది. ఆ రకంగా తెలుగు పరిశ్రమ ఆమెని గుర్తించిందన చెప్పాలి. సిద్దు కూడా యూత్ లో మంచి ఫాలోయింగ్ సంపాదించిన నటుడు. అతని సరసన నటించిన హీరోయిన్లకు ఓ ఐడెంటిటీ దక్కుతుంది. మరి నిధి తెలుగు సినిమాకి సంతకం చేసిన వైనంలో భవిష్యత్ లో ఇంకా ఎలాంటి అవకాశాలు చేజిక్కించుకుం టుందో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.